

కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా కబర్ది

నెల్లూరు (లీగల్), ఆగస్టు 3 : కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా నెల్లూరు ఒకటవ అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న జీ.కబర్దికి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పదోన్నతి కల్పించింది. ఆ మేరకు ఆయన్ను బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు శనివారం జిల్లా కేంద్రానికి చేరాయి. ఇప్పటివరకు కబర్ది చూస్తున్న బాధ్యతలను నెల్లూరు ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయాధికారికి అప్పగించాలని హైకోర్టు తన ఉత్తర్వులలో పేర్కొంది.

ఏం బావా.. వస్తావా!?

- నీక్కావలసింది.. నా దగ్గర ఉందంటూ హొయలు
- నెల్లూరు నడిబొడ్డున వేశ్యలు, హిజ్రాల ఆగడాలు
- రెడ్‌లైట్ ఏరియాగా విజయమహల్ గేటు రైల్వేకట్ట ప్రాంతం
- అన్నీ తెలిసినా కునుకు వీడని పోలీసులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజానీకం



చీకట్లో చెట్టు కింద బేరసారాలు



ఇదీ నారేటు వస్తే రా!?



ఏయ్.. వస్తారా!?

అనారోగ్యంతో ఉన్న బిడ్డను బృందావనంలోని ఓ ఆసుపత్రిలో చూపించి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆటో కోసం దంపతులు రోడ్డుపై నిలబడి ఉన్నారు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన నలుగురు యువకులు 'ఏయ్.. ఈమె రేటు ఎంత !?' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. భార్య గురించి తప్పుగా మాట్లాడటంతో భర్త ఆగ్రహానికి గురయ్యాడు. పూటుగా మద్యం సేవించిన యువకులు 'ఇవన్నీ చాలానే చూశాములే.' అంటూ గొడవకు దిగారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో బిడ్డను, భార్యను కాపాడుకునేందుకు గట్టిగా కేకలు వేశాడు. అంతే.. ఆ యువకులు బైక్‌లపై పరారయ్యారు.

నెల్లూరు జిల్లాతోపాటు, ప్రకాశం, తిరుపతి, కడప, కర్నూలు తదితర పొరుగు జిల్లాల నుంచి నెల్లూరు నగరంలో ఉన్న ప్రముఖ వైద్యశాలలకు ప్రతి రోజు వేలాది మంది ప్రజలు వస్తుంటారు. రాత్రింబవళ్లు పొగతోట నుంచి బృందావనం వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. అలాగే ఎప్పటినుంచో మంచి పేరున్న మూడు హాళ్ల ప్రస్తుతం ఎస్-2 థియేటర్లకు అర్ధరాత్రి 2 గంటల సమయంలోనూ సెకండ్ షో చూసుకొని ఎంతోమంది ఇళ్లకు వెళుతుంటారు. అలాంటి ప్రాంతాలైన పొగతోట, బృందావనంలో ఇటీవల వేశ్యలు, హిజ్రాల ఆగడాలు ఎక్కువయ్యాయి. రైల్వేకట్టకు ఇరువైపులా పదుల సంఖ్యలో నిల్చొని దారినపోయే వారిని చేతులు ఊపుతూ 'వస్తావా..' అంటూ పిలుస్తున్నారు. ఈ ప్రాంతం రెడ్‌లైట్ ఏరియాగా మారడంతో పదుల సంఖ్యలో మగవారు బైక్‌లు, ఆటోలు, కార్లలో వస్తూ గుంపులు గుంపులుగా నిలబడి బేరసారాలు చేస్తున్నారు.

● పెడదోవపడుతున్న యువత

విద్య, ఉపాధి కోసం ఎంతోమంది యువకులు నెల్లూరు నగరంలో ఉంటున్నారు. పొగతోట నుంచి బృందావనం వరకు రైలుకట్ట పక్కనే వేశ్యలు, హిజ్రాలు నిలబడి యువకులను ఆకర్షించేలా వయ్యారాలు ఒలకబోస్తూ సైగలు చేస్తుండటంతో ఆకర్షితులవుతున్నారు. వారి మోజులో పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

● మహిళలకు తప్పని వేధింపులు

పొగతోట, బృందావనం ప్రాంతాల్లో ఉన్న వైద్యశాలలకు రాత్రి సమయాల్లోనూ ప్రజలు వస్తుంటారు. అయితే ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండటంతో సామాన్య ప్రజలు రోడ్డుపై వారి మధ్య నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులకు వెళుతున్న మహిళలను కూడా కొంతమంది విటులు అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. ఇది తెలిసిన చాలామంది ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆసుపత్రులకు వెళుతున్నారు. ఈ విషయం తెలియని వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అది నెల్లూరులోని నడిబొడ్డున ఉన్న ప్రాంతం. రాత్రి 8 గంటలు దాటితే చాలు.. కళ్లు జిగేల్‌మనిపించే చీరలు, పంజాబీ డ్రస్సులు ధరించిన మహిళలు, హిజ్రాలు రోడ్డుపై వాలిపోతారు. అటువైపు వెళ్లే మగవారిని తమ కవ్వింపు చర్యలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. "ఏం బావా వస్తావా!?.. నీక్కావలసింది.. నా దగ్గర ఉంది" అంటూ కొంటెగా.. మత్తుగా పెదాలు కొరుకుతూ సైగలు చేస్తూ ఆహ్వానిస్తారు. నగరంలోని నక్కలోళ్ల సెంటర్ దాటాక పొగతోట నుంచి బృందావనంలోని ఎస్-2 థియేటర్ దాటి మలుపు తిరిగే వరకు రైలు కట్ట వెంబడి రెడ్‌లైట్ ఏరియాను మించిన పరిస్థితులు అక్కడున్నాయి. కుటుంబసభ్యులతో రాత్రిపూట ఇటువైపు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది.

● కత్తులతో బెదిరించి దోపిడీలు

కొందరు హిజ్రాలు, పిట్‌ప్యాకెట్‌లకు పాల్పడే వారు బృందాలుగా ఏర్పడి ద్విచక్ర వాహనదారులు, పాదచారులను టార్గెట్ చేస్తున్నారు. కత్తులతో వారిని బెదిరించి నగదు, నగలు, సెల్‌ఫోన్లు ఇతర విలువైన వస్తువులను దోచుకెళుతున్నారు. ప్రధానంగా విటులుగా వచ్చేవారినే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. పనైపోయిన తర్వాత అక్కడ నుంచి వెళుతున్న వారిపైనా దోపిడీకి పాల్పడుతున్నారు. అయితే ఈ విషయం పోలీసులకు చెబితే తమ పరువు పోతుందన్న భయంతో ఫిర్యాదు కూడా చేయడం లేదు.

● పోలీసుల తీరుపైనా విమర్శలే

నగర నడిబొడ్డున ఇష్టానుసారంగా వ్యభిచారం జరుగుతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా విజయమహల్ గేటును కొన్ని నెలలుగా పూర్తిగా మూసివేయడంతో గేటుకు ఇరువైపులా వేశ్యలు, హిజ్రాలు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. గేటు ఇవతల రామచంద్రారెడ్డి వైద్యశాల ప్రాంతం సంతపేట పోలీసుస్టేషన్ పరిధి, గేటు ఇవతల ఓ బార్ ఉన్న ప్రాంతం బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధి, ఎస్-2 థియేటర్ రోడ్డు చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో ఉంది. ఈ ప్రాంతం మూడు స్టేషన్ల పరిధిలో ఉండటంతో ఎవరికివారు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది పోలీసులు హిజ్రాలు, వేశ్యల వద్ద మామూళ్లు తీసుకుంటూ విటులనే టార్గెట్ చేస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకోవడం, స్టేషన్‌కు వెళ్లేలోపే వారి నుంచి ఎంతోకొంత లాక్కొని వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి జనసంద్రమైన ఈ ప్రాంతంపై నిఘా ఉంచాలని నగరవాసులు కోరుతున్నారు.

- నెల్లూరు (క్రైం)



జీవితంలో మధుర జ్ఞాపకం స్నేహం
రక్తబంధం కన్నా గొప్పది ఆ బంధం
నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం




ఓ.. మై ఫ్రెండ్!

మనతో ఉంటూ మన మంచిచెడులు ఆలోచించేవాడే ఫ్రెండ్. మన కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ సహాయ పడేవాడే నిజమైన మిత్రుడు. అలాంటి మిత్రుడిని మనం ఎప్పటికీ వదులుకోకూడదు. తిట్టుకున్నా.. కొట్టుకున్నా నిజమైన స్నేహితులు ఎప్పటికైనా మళ్లీ కలుస్తారు. అదే స్నేహబంధానికి ఉన్న గొప్ప పరమార్థం. ప్రస్తుత సమాజంలో స్నేహానికి ఉన్న ప్రాధాన్యం మరేదేనికీ లేదు. ప్రతి మనిషి జీవితంలో ఒక్కసారైనా వెనక్కు తిరిగి చూసుకుంటే సగం జీవితం స్నేహితులతోనే ఉంటుంది. అది స్కూల్, కాలేజ్, ఆఫీస్ ఇలా ఏదైనా కావచ్చు. ఆ మధుర జ్ఞాపకాలు తలచుకోవాల్సిందే. అందుకే స్నేహం శాశ్వతం. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

దశాబ్దాలుగా చెదరని స్నేహం

మూడు దశాబ్దాలకుపైగా చెక్కుచెదరని స్నేహంతో అందరం కలిసి వివేకానంద వాకర్స్ సంఘాన్ని ఏర్పాటు చేశాం. కుల, మతాలకు అతీతంగా స్నేహమే పరమావధిగా ఎన్నో సంవత్సరాల నుంచి ఎలాంటి పొరపొచ్చలు, బేధాభిప్రాయాలు లేకుండా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నాము. వ్యక్తిగత సమస్యలు, సంతోషాల దగ్గర నుంచి కుటుంబ సంబరాల వరకు అన్నీ కలిసే చేసుకుంటున్నాము. వీటితోపాటు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ సమాజ సేవలో కూడా పాలు పంచుకుంటున్నాము. అలాగే మిత్రులందరూ కూడా భారతీయులుగా భావించి ఎలాంటి కుల, మతాలకు తావులేకుండా స్నేహాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాము.

- వివేకానంద వాకర్స్ అసోసియేషన్, నెల్లూరు



కావలిలో సెవెన్ లయన్స్ మిత్రబృందం

కావలిలో 'సెవెన్ లయన్స్'

కావలిలో సెవెన్ లయన్స్ అంటే గాదంశెట్టి వేణు, పాదర్తి నాగరాజు, సువర్ణ శ్రీను, వేల్పూరి రవి, పెట్లుగాని రమేష్, లెక్కల సురేష్, శివకుమార్‌ల మిత్రబృందమే గుర్తుకు వస్తుంది. ఏ పని చేయాలన్నా ఈ ఏడుగురు మిత్రబృందం కలవాల్సిందే. రోజులో ఒక్కసారైనా అందరూ కలవడం, ఒకరికష్టాలు ఒకరు పంచుకోవడం జరుగుతుంది. శుభకార్యాలకు సామాజిక రాజకీయ కార్యక్రమాలకు కలిసి వెళ్తూ స్నేహమంటే సెవెన్ లయన్స్‌లా ఉండాలని పట్టణ ప్రజలు ఇప్పటికీ అనుకుంటుంటారు.

అర్ధశతాబ్దపు స్నేహం



ఈ ఇద్దరినీ చూస్తుంటే 1975లో విడుదలైన హిందీ సినిమా గుర్తుకు వస్తుంది. ఆ సినిమాలోని 'ఏ దోసితే.. హమ్ నహీ చోడెంగే..' పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆ సినిమాలోని ఇద్దరు హీరోలు అమితాబ్ బచ్చన్, ధర్మేంద్ర మధ్య సాగిన సన్నివేశాలు మనకు గుర్తుకువస్తాయి. ఈ ఫొటోలోని ఈ ఇద్దరిని చూసినా ఆ సినిమానే గుర్తుకు వస్తుంది. సంగం మండలం కొరిమెర్ల గ్రామానికి చెందిన వెలినేని యానాదయ్య, పొదలకూరు మండలం సూరాయపాళెం ఇమామ్ సాహెబ్‌లు 23 ఏళ్ల వయసులో స్నేహితులయ్యారు. ఇప్పుడు ఇద్దరి వయసు 75 ఏళ్లు. ఎవరికి ఏ కష్టం వచ్చినా పంచుకుంటారు. వీరిద్దరూ ఎక్కడ ఉన్నా ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడుకోవాల్సిందే. ఈ ఇద్దరే కాదు. ఫోన్ చేస్తే యానాదయ్య భార్య ప్రభావతి, కుమారులు, కుమార్తె, చివరకు మనువళ్లు, మనువరాళ్లు మాట్లాడతారు. యానాదయ్య కుటుంబ ఎప్పుడైన స్వగ్రామం వచ్చినప్పుడు సంగంలోని ఇమామ్ సాహెబ్ వద్దకు తప్పక వస్తారు. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. 1968లో ఏర్పడిన వీరి స్నేహం నేటి యువతకు ఆదర్శం.

- సంగం

స్నేహానికి పునాదులు ఎక్కువగా బాల్యదశలో పడతాయి. బాల్యంలో ఏర్పడిన స్నేహం ధృడంగా, మధురంగా ఉంటుంది. వారికి ఉన్న పరిచయాలను బట్టి కొందరికి స్నేహితులు తక్కువగా, మరికొందరికి ఎక్కువగా ఉండటం సహజం. పాత రోజుల్లో స్నేహాల పరిస్థితి వేరు.. ప్రస్తుత స్నేహాల పరిస్థితి వేరు. ప్రస్తుతం ఉన్న స్నేహితుల నడుమ కమ్యూనికేషన్ గ్యాప్ బాగా పెరిగిపోయింది. నాడు తరచూ కలుసుకునే స్నేహితులు నేడు ఇంటర్నెట్‌లో కలుసుకుంటున్నారు. ప్రస్తుతం 35 శాతం మంది మాత్రమే స్నేహితులను ప్రత్యక్షంగా కలుసుకుని మాట్లాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పాతతరం స్నేహితులైతే ఉత్తరాల ద్వారా మరికొంత కాలానికి ల్యాండ్‌ఫోన్‌లతో పలకరింపులకు పరిమితమైన స్నేహితులు నేడు పెరిగిన ఆధునిక టెక్నాలజీ కారణంగా ఇంటర్‌నెట్ సౌకర్యంతో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ప్రతి క్షణం స్నేహితులు పక్కనే ఉన్న రీతిలో మానసిక సంతృప్తి పొందుతున్నారు. ఎల్లలు దాటి ఏ ప్రాంతంలో స్నేహితులు ఉన్నా క్షణాల్లో పలకరించుకునే పరిస్థితులు కల్పించు కుంటున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, హైక్, వీచాట్, గూగుల్‌ప్లస్, టెలిగ్రాం, వైబర్, ఫేస్‌బుక్ వంటి పలు రకాల సోషల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించు కుంటున్నారు. ఒక్క పాత స్నేహితుడు కనిపిస్తే చాలు వెంటనే వారి మిత్ర బృందానికి సమాచారం చేరవేస్తున్నారు. అందరి వివరాలను సేకరించుకుని ఫోన్ నెంబర్లతో వివిధ పేర్లతో గ్రూపులను క్రియేట్ చేసుకుంటున్నారు. పండుగలు, ఇతర వేడుకలు, సంబరాలు కలిసి చేసుకోవడంతోపాటు సరికొత్త ఎమోజీస్‌తో సమాచారం ఇవ్వడం కొత్త ట్రెండ్‌గా మారింది.

● సేవాభావం..

ఒక పాఠశాలలో లేదా కళాశాలలో కలిసి చదువుకున్న మిత్రబృందం అంతా కలిసి వారు చదువుకున్న విద్యాసంస్థల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా వారి కుటుంబ సభ్యులతో కలిసి రోజంతా సందడి చేసి చదువు చెప్పిన గురువులను సన్మానిస్తున్నారు. చదువుకున్న విద్యాలయానికి ఏదైనా మంచి చేయాలన్న తలంపుతో శాశ్వత ప్రాజెక్ట్‌లను నిర్మించేలా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. వారు చదువుకున్న కాలాన్ని గుర్తుంచుకునేలా విలువైన, ఉపయోగకరమైన వస్తువులను బహూకరించే సంప్రదాయం కొనసాగుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో చిన్ననాటి స్నేహితులంతా కలిసి ఆర్థికపరమైన నిధిని ఏర్పాటు చేసుకుని ఒకొరికొకరు సహాయ పడడంతోపాటు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ముందు తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒక మిత్రుడికి ఆపద వచ్చిందంటే చాలు మేమున్నాం అంటూ చేయీ చేయీ కలిపి బాసటగా నిలుస్తున్నారు. ఇలాంటి విలువైన స్నేహానికి హ్యాట్సాఫ్ చెబుతూ మిత్రులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.

- నెల్లూరు (విద్య)

ఇలా పుట్టింది!

స్నేహం అనే గొప్ప అనుభూతిని సంబరంగా మార్చుకోవాలన్న ఆలోచన నుంచి పుట్టిందే స్నేహితుల దినోత్సవం. మంచి స్నేహితులను గుర్తించుకునేందుకు, వాళ్లతో గడిపేందుకు ఏటా ఆగస్టు మొదటి ఆదివారాన్ని ఫ్రెండ్‌షిప్ డేగా జరుపుకుంటారు. ఈ స్నేహితుల దినోత్సవానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. 1935 ఆగస్టు మొదటి శనివారంలో అమెరికా ప్రభుత్వం చేతిలో హతమైన తన మిత్రుడిని మరిచిపోలేక మరో మిత్రుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఈ ఘటన ప్రజలను, ప్రభుత్వాన్ని కలిచివేసింది. ప్రజల ఆమోదంతో వెంటనే ప్రభుత్వం ఆగస్టు మొదటి ఆదివారాన్ని ఫ్రెండ్‌షిప్ డేగా ప్రకటించింది. అప్పటి నుంచి చిన్నా, పెద్దా, వయసుతో తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.




కోవూరులో చిరునవ్వులు చిందిస్తున్న స్నేహితురాళ్లు

స్నేహం ఎంతో విలువైనది

దశాబ్ద కాలాల స్నేహాన్ని ఒక దగ్గర చేర్చి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నాం. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి పొరపచ్చలు లేకుండా అందరూ ఒకేమాటపై ఉంటూ అన్ని రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. స్టేడియంలో నిరంతరం స్నేహితుల నడుమ ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి విజేతకు బహుమతి అందిస్తూ ఉత్సాహపరుస్తున్నాము. మనిషి అవసరాలన్నింటిలో కూడా స్నేహిలంతా కలిసి చర్చించుకుని ఎవరికి ఏ సమస్య వచ్చినా మేమున్నాం అంటూ అందరం ఒకరికి ఒకరం అండగా ఉంటున్నాం.

- ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్, నెల్లూరు

స్నేహమంటే భరోసా



కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యుల కన్నా స్నేహితులే భరోసాగా నిలబడ తారు. వేల కోట్ల ఆస్తులకన్నా స్నేహితుడు మిన్న అనే సందర్భాలు ఎన్నో ఉంటాయి. దాపరికం లేకుండా ఉండటం, స్నేహితుడు కష్టంలో ఉన్నప్పుడు అడక్కుండానే సాయం అందించావాడే స్నేహితుడు. నిజమైన స్నేహితులున్నవారు ఎటువంటి కష్టాన్నయినా ఎటువంటి ఇబ్బందికైనా భయపడరు.

- గాదంశెట్టి వేణుగోపాల్, కావలి

ఈ బంధమే మా ఆరోగ్యం కాపాడుతోంది!



చిన్నప్పుడు చేసిన చిలిపి పనులే నిత్యం స్మరించుకుంటాం. ప్రతిరోజూ సాయంత్రం ఈ వేప చెట్టుకిందకు చేరిపోతాం. ఆ రోజు ఏమేమి చేశామో మాట్లాడుకుంటాం. కాసేపు వాదించుకుంటాం. అంతా కలిసి సరదాగా టీ తాగుతాం. ఆనందంగా ఇంటికి వెళ్తాం. స్నేహబంధమే మా ఆరోగ్యాన్ని కాపాడుతోంది.

- మారుబోయిన వరప్రసాద్, రిటైర్డు ఉపాధ్యాయుడు, కోవూరు.

వారి మధ్య గడపడమే హుషారు



ఎన్ని పనులున్నా ప్రతి రోజూ సాయంత్రం కోవూరు రైల్వేరోడ్డుకు వచ్చేస్తాం. అందరం కలుస్తాం. కష్టసుఖాలు పంచుకుంటాం. ఎంతో శక్తిని పొంది ఇంటికి వెళ్తాం. ఈ వయసులో ఇంతకన్నా ఆనందం ఎక్కడుంటుంది చెప్పండి. స్నేహితుల మధ్య గడపడమే హుషారునిస్తుంది.

- వెంకట వరప్రసాద్, కోవూరు

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు (హరనాథపురం): ఎన్నికల విధుల కోసం పొరుగు జిల్లాలకు బదిలీ అయి, తిరిగి జిల్లాకు చేరుకున్న 42 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఆనంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రాంతం
జి. రాఘవేంద్రరావు	డీఏఓ (నెల్లూరు ఆర్డీఓ)
డి. లాజరస్	నెల్లూరు రూరల్
షేక్ షఫిమాలిక్	నెల్లూరు అర్బన్
ఏ వెంకటేశ్వర్లు	బుచ్చిరెడ్డిపాళెం
ఎం. పద్మజ	టీపీ గూడూరు
ఎస్.శ్రీనివాసులు	వెంకటాచలం
సిహెచ్ సుబ్బయ్య	మనుబోలు
ఎం. శ్రామ్‌సుందరరాజా	రాపూరు
ఎం. నిరంజన్	డీఏఓ (ఆత్మకూరు ఆర్డీఓ)
వి. సుధీర్	ఆత్మకూరు
ఏవీ రమణరావు	చేజర్ల
డి. శ్రీరామకృష్ణ	ఏఎస్‌పేట
బి. శోమ్లానాయక్	సంగం
కె వీరవసంతరావు	అనంతసాగరం
ఎం.సుభద్ర	ఉదయగిరి
ఆర్.సూర్యనారాయణ సింగ్	డీఏఓ (కావలి ఆర్డీఓ)
పి. హేమంత్‌కుమార్	జలదంకి
వై. నాగరాజు	దుత్తలూరు
కె. స్ఫూర్తి	కొడవలూరు
కె. చంద్రశేఖర్	విడవలూరు
ఎస్‌ఎం హమీద్	వింజమూరు
టీ. శ్రీనివాసులు	డీఏఓ (కందుకూరు ఆర్డీఓ)
సయ్యద్ ఇక్బాల్	కందుకూరు
ఈ. రమాదేవి	లింగసముద్రం
వి. లావణ్య	ఉలవపాడు
ఎస్‌కే. అబ్దుల్ హమీద్	వలేటివారి పాళెం
కేవీబీటీ సుందరమ్మ	కొండాపురం
ఎస్‌ఎండీ హుస్సేన్	వరికుంటపాడు
టి. విజయకుమార్	ఏవో కలెక్టరేట్
పి. శాంతకుమారి	కలెక్టరేట్
ఎస్. శ్రీనివాసులరెడి	కలెక్టరేట్ (ల్యాండ్ మ్యాటర్స్)
ఎంవీకే సుధాకర్‌రావు	కలెక్టరేట్ జి సెక్షన్
పి. విజయకుమార్	కలెక్టరేట్ లీగల్ సెల్
పి. శ్యామలమ్మ	కలెక్టరేట్ కేఆర్‌ఆర్‌సీ
ఎస్.. రమాదేవి	స్పెషల్ తహసీల్దార్ (ఎల్‌ఏ), నెల్లూరు
టి. శ్రీనివాసులు	స్పెషల్ తహసీల్దారు (ఎల్ఆర్), నెల్లూరు
కె. రాజ్యలక్ష్మి	స్పెషల్ తహసీల్దారు కేపీటీపీఎస్, నెల్లూరు
జి. రవీంద్రబాబు	ఏపీఓ, ఐటీడీఏ, నెల్లూరు
ఐ.ఎస్ ప్రసాద్	తహసీల్దారు, తిరుపతి
ని, అనురాధ	తహసీల్దారు, తిరుపతి
పి. లక్ష్మీనరసింహం	తహసీల్దారు, తిరుపతి

డిప్యూటీ తహసీల్దార్లకు..

పేరు	ప్రాంతం
పి. శైలకుమారి	తిరుపతి
టీవీఎం కృష్ణప్రసాద్	ఇందుకూరుపేట
ఏ. లక్ష్మీనారాయణ	అల్లూరు
పి. శ్రావణ్‌కుమార్	కావలి
కె. శిరీష	తిరుపతి
జి. స్వర్ణ	గుడ్లూరు
జె. స్వప్న	మర్రిపాడు
ఎం. సారంగపాణి	పొదలకూరు
ఎం. సురేష్‌బాబు	బోగోలు
సీహెచ్ హరికృష్ణ	తిరుపతి
ఎం. కోటేశ్వరరావు	దగదర్తి
ఎం. శ్రీనివాసులు	తిరుపతి

జిల్లాలో 12 మంది సీనియర్ డిప్యూటీ తహసీల్దార్లకు అడహాక్ తహసీల్దార్లుగా పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్లకు పోస్టింగ్ ఇవ్వటం పట్ల ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి హర్షం ప్రకటించారు.

చేపలు తిన్న చోరులపై కేసులు

● కలువాయి జడ్పీటీసీ సహా 25 మందిపై నమోదు

కలువాయి, ఆగస్టు 3 : కలువాయి చెరువులో అక్రమం చేపల వేటి సాగించినందుకు జడ్పీటీసీ సభ్యుడితోపాటు 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో తొలుత కలువాయి మత్స్య సొసైటీ పాలకవర్గ సభ్యులతోపాటు 20 మందిపై కేసు నమోదయ్యింది. తాజాగా జడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డితోపాటు మాకిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, చల్లా మల్లిఖార్జునరెడ్డి, గోపిదేసి రమణయ్య, చల్లా భక్తవత్సలరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అయ్యప్ప తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలోని చెరువులను ఏజెన్సీలకు అప్పగించి వాటిలో చేపల పెంపకం ద్వారా ఆదాయం గడించాలని నిర్ణయించారు. అందులో భాగంగా జిల్లాలోని 27 చెరువులను పైలెట్ ప్రాజెక్టు కింద చేర్చి టెండర్లు కూడా నిర్వహించారు. ఆ జాబితాలో ఉన్న కలువాయి చెరువును అప్పటి ప్రభుత్వం సొసైటీకి లీజుకు ఇవ్వకుండా నిలిపివేసింది. అయితే, మత్స్య సొసైటీ పాలకవర్గానికి చెరువుపై ఎలాంటి అధికారం లేకపోయినా జడ్పీటీసీ బి.అనిల్‌కుమార్‌రెడ్డి ప్రోద్బలంతో వైసీపీ నాయకులు చెరువులో అక్రమంగా చేపలు పట్టించి విక్రయించారని మత్స్య సొసైటీ మాజీ అధ్యక్షుడు వజ్రాల శ్రీనివాసులు, కొంతమంది కలిసి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ద్వారా మత్స్య శాఖ జేడీకి ఫిర్యాదు చేయించారు. జేడీ ఆదేశాల మేరకు కావలి మత్స్య శాఖ ఏడీ శ్రీనివాసులు గత నెల 3వ తేదీన కలువాయిలో పలువురు మత్స్యకారులను విచారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రస్తుత మత్స్య శాఖ పాలకవర్గ సభ్యులతోపాటు 20 మందిపై కేసు నమోదు చేశారు. మళ్లీ విచారణ కొనసాగించిన ఏడీ మరో ఐదుగురిపై ఫిర్యాదు చేయడంతో మొత్తం 25 మందిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త చట్టాలపై న్యాయవాదులకు అవగాహన



మాట్లాడుతున్న న్యాయాధికారి పీనపాటి భరద్వాజ్

నెల్లూరు(లీగల్), ఆగస్టు 3 : కొత్తగా వచ్చిన క్రిమినల్ చట్టాలపై 1వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి పీనపాటి భరద్వాజ్, మొదటి తరగతి స్పెషల్ జ్యుడిషియల్ న్యాయాధికారి ఫర్ రైల్వేస్ పాలమంగళం వినోద్‌లు న్యాయవాదులకు అవగాహన కల్పించారు. శనివారం ఉదయం నెల్లూరు బార్ అసోసియేషన్ హాలులో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సవరించిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్, ఐపీసీల స్థానంలో ప్రవేశపెట్టిన కొత్త చట్టాలైన భారతీయ నాగరిక్ సురక్షా సన్హిత, భారతీయ న్యాయ సన్హిత, భారతీయ సాక్ష్యా అధినియం గురించి న్యాయాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ.ఉమామహేశ్వర్‌రెడ్డి, పీ.సుందరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బీచ్ కబడ్డీ పోటీలు


పోటీలో తలపడుతున్న నెల్లూరు, వైజాగ్ జట్లు

ఇందుకూరు పేట, ఆగస్టు 3: మండలంలోని ఎంకేఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న పముజుల శ్రీనివాసులు మహాలక్ష్మమ్మ స్మారక రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీలలో పురుషులు 13 జట్లు, మహిళలు 13 జట్లు పాల్గొన్నాయి. రెండోరోజు శనివారం జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడగా శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. నెల్లూరు, కర్నూలు మధ్య జరిగిన పోరులో నెల్లూరు జట్టు, తూర్పు గోదావరి, కడప జట్ల మధ్య జరిగిన పోటీ ల్లో కడప జట్టు విజయం సాధించింది. అదేవిధంగా మహిళల విభాగంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన పోటీలో కడప జట్టు విజయం సాధించింది. గుంటూరు, నెల్లూరు మధ్య జరిగిన పోరులో గుంటూరు జట్టు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన పోరులో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. చివరిరోజు ఆదివారం జరగబోయే ఫైనల్స్‌లో విజేతలకు నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు రవి, దాసరి విజయ్‌లు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

కవితది ఆత్మహత్య కాదు హత్యే..!

● పోలీసుల విచారణలో నిజాలు వెలుగులోకి..
● వివరాలు వెల్లడించిన రాపూరు సీఐ విజయకృష్ణ
● కటాకటాల పాలైన భర్త బల్లి చంద్రయ్య

రాపూరు (డక్కిలి), ఆగస్టు 3: మండలంలోని గోనుపల్లి హరిజనవాడకు చెందిన బల్లి కవితది ఆత్మహత్య కాదు.. హత్య అని పోలీసుల విచార ణలో నిజాలు వెలుగులోకి వచ్చాయి. శనివారం రాపూరు పోలీసు సర్కిల్ కార్యాలయంలలో సీఐ విజయకృష్ణ విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన బల్లి రామచంద్రయ్య భార్య కవిత మధ్య కొంతకాలం నుంచి కుటుంబ కలహాలు ఉన్నాయి. అందులో భాగంగా గత నెల 30వ తేదీన ఆయన మద్యం మత్తులో కవితను దారుణంగా కొట్టి అనంతరం గొంతునులుమి హత్య చేసి ఆమె హత్యకు పాల్పడిందని చిత్రీకరించాడు. అయితే అదే రోజు కవిత బంధువులు ఆలూరు చిన చెంగయ్య, ఆలూరు పెద్ద చెంగయ్యలు రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాపూరు ఎస్‌ఐ మాలాద్రి సంఘటన స్థలాన్ని పరిశీలించి కవిత మృతదేహానికి శవపరీక్ష నిమిత్తం రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కవితది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త బల్లి రామచంద్రయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా భర్తే భార్యను గొంతునులిమి చంపేసినట్లు విచారణలో వెల్లడించాడు. ఈ సందర్భంగా రామచంద్రయ్యను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని సీఐ తెలిపారు. నిందితుడు రామచంద్రయ్యపై కొత్త చట్టంలోని సెక్షన్లు 85, 103, క్లాజ్ 238 కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ కేసును నాలుగు రోజుల్లో చేధించినందుకు ఈ ప్రాంతవాసులు సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ మాలాద్రిని అభినందిస్తున్నారు.

యాష్ పాండ్ కట్ట తెగి
పొల్లాలోకి బూడిద నీరు


జెన్‌కో యాష్‌పాండ్ కట్ట తెగి పొల్లాలోకి ప్రవహిస్తున్న బూడిద నీరు

ముత్తుకూరు, ఆగస్టు 3 : నేలటూరు జెన్కో థర్మల్ కేంద్రం యాష్ పాండ్ కట్ట తెగడంతో శనివారం రాత్రి సమీప పొలాల్లోకి బూడిద నీరు ముంచెత్తింది. జెన్కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా యాష్ పాండ్ కట్టలు తెగిపోయాయని సమీప గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. యాష్ పాండ్‌లు పూర్తిగా నిండిపోయి ప్రమాదం అంచుకు చేరుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు బూడిద పైపులైన్లు పగిలిపోయి రోడ్లపైకి బూడిదతో కూడిన నీరు చేరి కాలుష్యానికి కారణమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏకంగా యాష్ పాండ్ చెరువు కట్ట పడమర వైపు తెగిపోయి మునునూరివారిపాలెం, వరకవిపూడి గ్రామాలకు చెందిన పొలాలు, రొయ్యల చెరువులు బూడిదమయంగా మారాయి. పరిస్థితి ఇలాగే ఉంటే బూడిదతో కూడిన నీరు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. జెన్కో అధికారులు తక్షణం చర్యలు తీసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	230
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6674
వెండి కిలో ధర	రూ. 85,000
వెండి ఒక గ్రాము	రూ. 87.00

సోమశిలకు 6,296 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, ఆగస్టు 3: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం సాయంత్రానికి 6,296 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.899 టీఎంసీలు కాగా 10.795 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర, దక్షిణ కాలువలకు 10, డెల్టాకు 200 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన!



నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 3 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక శాఖల్లో ప్రక్షాళన చేపట్టింది. తాజాగా ప్రభుత్వానికి ఆదాయవనరుగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలోని ఆశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గత ప్రభుత్వంలో సాధారణ బదిలీలు జరగక పోవడంతో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్‌లను డిప్యుటేషన్ పద్ధతిలో నియమించారు. కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు తాము కోరుకున్న ప్రాంతానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్‌లు, సీనియర్ సహాయకుల డిప్యుటేషన్‌లను రద్దు చేసి యథా స్థానాలకు బదిలీ చేశారు. వారిలో బుచ్చిరెడ్డి పాళెం సబ్ రిజిస్ట్రార్ కోటేశ్వరమ్మను ఆత్మకూరు, ఆత్మకూరు సీనియర్ సహాయకుడ్ని కోవూరు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ ఉన్నం శ్రీనివాసులను వెంకటగిరి, వెంకటగిరిలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీనియర్ సహాయకుడు తంబి మల్లికార్జున్‌ను గూడూరుకు సీనియర్ సహాయకుడిగా, కోవూరు సబ్‌రిజిస్ట్రార్ చంద్రశేఖర్‌రెడ్డిని బుచ్చిరెడ్డిపాళెం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

● 7 వేల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములపై...

ఇరవై ఏళ్ల దాటిన అసైన్డ్ భూములను విక్రయించుకొనేందుకు గత వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేసిం ది. ఈ ముసుగులో వైసీపీ నాయకులు కొందరు రైతులతో ఒప్పందం కుదుర్చుకుని భూములను వారి పేరిట మార్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ నేతలు చెప్పిన భూములను అధికారులు 22-ఏ జాబితా నుంచి తప్పించి రిజిస్ట్రేన్లు చేశారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా రెవెన్యూ శాఖ నుంచి ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి 7వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయవచ్చని రిజిస్ట్రేన్‌శాఖకు నివేదిక అందింది. ఈ నివేదిక అందుకున్న రిజిస్ట్రేషన్‌శాఖ సబ్ రిజిస్ట్రార్‌లు వింజమూరు, ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి 147 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, ధీమా వ్యక్తం చేసి మిగిలిన ఫ్రీహోల్డ్ భూములను కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చూసిన వైసీపీ నేతలకు నిరాశే మిగిలింది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్‌శాఖపై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఆ శాఖ ఐజీ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లపై నివేదిక కోరారు. దీంతో రిజిస్ట్రేషన్ చేసిన భూములు సక్రమమైనవేనా, అక్రమ రిజిస్ట్రేషన్లా అనే అంశ పై జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు అయితే రద్దు చేయడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తే చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లోనైనా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌లపై చర్యలు తీసుకుంటాం. జిల్లా రెవెన్యూశాఖ నుంచి 7వేల ఎకరాలకు పైబడి ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి నివేదిక అందింది. అందులో 147 ఎకరాలకు రిజిస్ట్రేన్లు చేశారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు మినహా అదనంగా ఏమి చెల్లించాల్సిన అవసరం లేదు. అలా ఎవరైనా అదనంగా అడిగినా, రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పర్సంటేజీలు అడిగినా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసకుంటాం.

- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

● అంకణాల లెక్కన లంచాలు..

జిల్లాలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాల్లో అంకణాల లెక్కన లెక్కకట్టి లంచాలు అడుగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతోన్నాయి. కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు ఆస్తి రిజిస్ట్రేషన్ విలువలో పెద్ద మొత్తంలో పర్సెంటేజీలు అడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారులు రిజిస్ట్రే షన్ విలువలో ఒక శాతం సబ్ రిజిస్ట్రార్‌లకు ఇవ్వాలనే తంతు గతంలో సాగింది. ఇప్పుడు అంక ణాల లెక్కన స్థలాలకు, ఎకరాల లెక్కన భూములకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయి. దళారులు కొందరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తిరుగుతూ రాజ్యమేలుతోన్నారు. ఎవరు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చారో, ఎవరు దళారులో చెప్పలేని స్థితి ఈ కార్యాలయాల్లో నెలకొంది. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో కూడా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కార్యాలయంలో 6న జాబ్‌మేళా

నెల్లూరు, (స్టోన్ హౌస్ పేట), అగస్టు 3: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 6వ తేది జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో శ్రీరాం ఫైనాన్స్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ బ్యాంకు వారు పాల్గొంటా రని పేర్కొన్నారు. 145 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగులు ఎంపికలకు హాజరు కావాలని పేర్కొన్నారు. రూ.18 వేల జీతం, రూ.25 వేల ఇన్‌సెంటీవ్‌లు చెల్లిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు 6వ తేది ఉదయం జిల్లా ఉపాధి కార్యాలయంకు హాజరు కావాలని పేర్కొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి
7 వరకు గడువు పొడిగింపు

● గురుకుల విద్యాలయ సంస్థ కోఆర్డినేటర్


ఇన్‌చార్జి కోఆర్డినేటర్ జయలక్ష్మి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 3 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5, 6వ తరగతులు, ఇంటర్‌లో ప్రవేశం పొందడానికి ఈనెల 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు గురుకుల విద్యాలయ సంస్థ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ కడియనూరు జయలక్ష్మి చెప్పారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వాస్తవానికి జూలై 31తో గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు గడువు ముగిసిందన్నారు. ప్రవేశాల కోసం దరఖాస్తులు సమర్పించిన వారి కోసం ఈ గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా విశిష్ట వైద్యం

● నెల్లూరులో మెడికల్ సెంటర్ ప్రారంభించిన డాక్టర్ రేలా


మాట్లాడుతున్న డాక్టర్ రేలా

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 3 : చెన్నై రేలా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఇక నుంచి నెల్లూరు జిల్లా ప్రజలకు విశిష్ట వైద్య చికిత్సలు అందించనున్నట్లు ఆ ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొహ్మద్ రేలా తెలిపారు. నెల్లూరు నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేలా మెడికల్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటి వరకు చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా 3వేల కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. మెర్సికిల్లింగ్‌కు కోర్టును ఆశ్రయించిన చిత్తూరు జిల్లాకు చెందిన 2 నెలల చిన్నారి జ్ఞానసాయికి 2016లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో కలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారికి 8 ఏళ్ల వయస్సు వచ్చిందన్నారు. అలాగే పలు విభాగాల వ్యాధుల నివారణలో చెన్నై రేలా ఆసుపత్రి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆసుపత్రి ప్రారంభోత్సవంలో చిన్నారి జ్ఞానసాయి పాల్గొని డాక్టర్ రేలాకు పుష్పగుచ్ఛం అందించింది. అనంతరం పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాస్కులర్ సర్జన్ డాక్టర్ సీఎంకే రెడ్డి, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు
సరికొత్త ఆవిష్కరణలు అవసరం

● 'అప్సాకాన్' సదస్సులో ఎంపీ వేమిరెడ్డి


సావనీర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, టీడీపీ నేత బీద, వైద్యులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 3 : పలు రకాల వ్యాధులు విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సరికొత్త ఆవిష్కరణలు, సాంకేతిక వైద్య చికిత్సలు అవసరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. నెల్లూరులో శనివారం జరిగిన అసోసియేషన్ పల్మోనాలజిస్ట్ ఆఫ్ సీమాంధ్ర కాన్ఫరెన్స్‌లో (అప్సాకాన్) ఎంపీ పాల్గొని మాట్లాడారు. ఊపిరితిత్తుల ఆరోగ్యం, సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహించడం, దేశవ్యాప్తంగా వైద్య నిపుణులు పాల్గొనడం మంచి పరిణామమన్నారు. ప్రస్తుతం లంగ్ కేన్సర్, ఆస్తమా, న్యూమోనియా వంటి వ్యాధుల సవాళ్లను ఎదుర్కొంటున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజలకు అవగాహన తక్కువగా ఉందని యువ వైద్యులు తగిన ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గత కొవిడ్ వల్ల వైద్య వ్యవస్థ ఎలాంటి ఇబ్బందులు పడిందో ప్రతి ఒక్కరికి తెలుసునన్నారు. ప్రాణాలకు తెగించి వైద్యులు కరోనా బాధితుల ప్రాణాలు కాపాడారని ఇందుకు ఊపిరితిత్తుల వైద్య నిపుణులు చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం అప్సాకాన్ సావనీర్ విడుదల చేశారు. ఆ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధులపై జరిగిన మేధో సదస్సులో వైద్యులు, మెడికోలు భారీగా పాల్గొన్నారు. ఈ సదస్సులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, అప్సాకాన్ కార్యనిర్వాహక కార్యదర్శి పిట్టి మలిఖార్జున, వైద్యులు ప్రేమానంద రాయ, రవీంద్రబాబు, గౌరినాథ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 3: స్కూటిపై వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని నవాబుపేట నజీర్‌తోటకు చెందిన షేక్ హాజీరంతుల్లా(52) ఈ నెల 2వ తేది రాత్రి 7 గంటలకు కొడవలూరులోని బంధువుల ఇంటికి పుట్టినరోజు వేడుకలకు స్కూటీపై వెళ్లారు. ఫంక్షన్ పూర్తి చేసుకున్న తర్వాత అర్ధరాత్రి అక్కడ నుంచి బయలుదేరి నగర సమీపంలోని భగత్‌సింగ్‌కాలనీ జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారిపై చెన్నై వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వేగంగా స్కూటీని ఢీకొని వెళ్లింది. ఈ ఘటనలో స్కూటీపై నుంచి కిందపడిన హాజీరంతుల్లా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. విషయాన్ని గమనించిన స్థానికులు సెల్‌ఫోన్ నుంచి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సైఫ్‌అలీ, కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాద ఘటనపై నార్త్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ గీతారమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. శనివారం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవ పరీక్ష నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

100 రోజుల్లో 1.25 లక్షల ఇళ్లు

● చిత్తశుద్ధితో లక్ష్యాలు పూర్తి చేయండి ● గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పార్థసారధి

మనుబోలు, ఆగస్టు 3: రాబోవు వంద రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.25లక్షల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం మంత్రి విజయవాడ నుంచి తిరుమలకు వెళుతూ మార్గమధ్యంలో కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆగారు. కాగా, మంత్రి వస్తారన్న సమాచారం అందుకున్న జిల్లా గృహనిర్మాణశాఖ అధికార బృందం అక్కడకు చేరుకుని మంత్రికి స్వాగతం పలికింది. అనంతరం కాసేపు అధికారులతో ఆయన జిల్లా గృహనిర్మాణశాఖ ప్రగతి గురించి సమీక్షించారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు, బిల్లులు, తదితర సమస్యలను అధికారులు మంత్రికి వివరించగా త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను అధికారులు చిత్తశుద్ధితో పూర్తిచేయాలన్నారు. అర్హులైన ప్రతిపేదవాడికి ఇళ్ళు మంజూరు చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులతో చాలామందికి బిల్లులు చెల్లించలేదన్నారు. అధికారులు గృహనిర్మాణ శాఖ పనితీరును మెరుగుపరచాలన్నారు. అనంతరం మంత్రి తిరుమల బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పీడీ దయాకర్, ఆర్‌డీవో మలోల, ఈఈలు, డిఈలు, ఏఈలు వెంకటేశ్వర్లు, రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వందశాతం అడ్మిషన్లు జరగాలి

● బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 3 : జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో 2024-25 విద్యా సంవత్సరంలో నూటికి నూరు శాతం అడ్మిషన్లు జరగాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య ఏఎస్‌డబ్ల్యువోలు, హెచ్‌డబ్ల్యువోలను ఆదేశించారు. శనివారం నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలన్నారు. ప్రతి వసతిగృహ సంక్షేమాధికారి నెలలో ఒకసారి కళాశాల, పాఠశాలలకు వెళ్లి పిల్లల హాజరు విధానాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యువోలు, హెచ్‌డబ్ల్యువోలు పాల్గొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై సమగ్ర విచారణ

అనంతసాగరం, ఆగస్టు 3: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలో ఇటీవల వెలుగు చూసిన నకిలీ ఇళ్ల స్థలాల పట్టాలపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు అనంత సాగరం ఇన్‌చార్జి తహసీల్దారు గిరీష్ తెలిపారు. శనివారం కార్యాలయంలో ఈ విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్రహారంలో గత ప్రభుత్వంలో వేసిన జగనన్న లేఅవుట్‌లో కొన్ని ఖాళీ ప్లాట్లు ఉండగా పలువురు ఆక్రమించి నిర్మాణాలు జరుపుతున్నట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు వీఆర్‌వో, సర్వేయర్‌ను క్షేత్రస్థాయికి విచారణకు పంపామన్నారు. నిర్మాణాలు చేస్తున్న వారి నుంచి ఇంటి పట్టాలను స్వాధీనం చేసుకొని పరిశీలించగా అందులో కొన్ని వ్యత్యాసాలు గమనించడంతో పాటు పూర్వపు తహసీల్దారు నరసింహరావు సంతకం కూడా సరిపోలనందున వారిని వివరణ కోరామన్నారు. అది తన సంతకం కాదని, ఫోర్జరీ చేసినట్లు వివరణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై సాగరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రెండు నకిలీ పట్టాలుగా రుజువైనందున బాధ్యులపై చట్టపరంగా క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేయడం జరిగిందని, పూర్తిస్థాయి నివేదికను ఆత్మకూరు ఆర్డీవోకు సమర్పించినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అబ్దుల్ ఖాదర్ గంధోత్సవం

● దర్గాలో ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక ప్రార్థనలు

● దర్గా అభివృద్ధి పనులకు రూ.6 లక్షల విరాళం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు కాకర్ల, దగుమాటి



విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబైన ఉదయగిరి దర్గా

ఉదయగిరి రూరల్, ఆగస్టు 3: హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా గంధోత్సవాన్ని భక్తులు శని వారం రాత్రి వైభవంగా జరిగింది. సాయంత్రం దర్గా కమిటీ సభ్యులు చదివింపుల కార్యక్రమం చేపట్టారు. హక్కుదారుల ఇంటి నుంచి విద్యుత్ దీపాలంకరణ, మేళతాళాలు, ఫకీరు జరుబుల నడుమ గంధాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గంధను దర్గాకు చేర్చి చదివింపులు చేసి భక్తులకు పెంచిపెట్టారు. భక్తులకు పెద్ద మసీదు ఆవరణలో అన్నదానం చేపట్టారు. హిందూ, ముస్లిం భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి, కావలి శాసనసభ్యులు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో తాము చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తామని, దర్గా అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

● రూ.6లక్షల విరాళం

దర్గా ఆవరణలో భక్తుల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్సు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దర్గా కమిటీ సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. స్పందించిన పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.5లక్షలను దర్గా కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్గా అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్‌బాషా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్, నాయకులు కాకర్ల వెంకట్, సందానీ, జాఫర్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

సంగం, ఆగస్టు 3: వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన బోగిరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి బెంగుళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. ఇటీవల ఇంటికి వచ్చాడు. కుటుంబ కలహాలతో ఈ నెల 19వ తేదీన చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లాడు. పనిచేసే కంపెనీకి వెళ్లలేదు. ఎక్కడ ఎతికినా కపినించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాశీరావు పుట్టినరోజు వేడుకలు

సీతారామపురం, ఆగస్టు 3: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు పుట్టినరోజు వేడుకలను శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సానిక బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భోగినేని కాశీ రత్తయ్య (గాంధి), విఠల రమేష్, గోసుల మల్లికార్జున, నవదీప్, మనోజ్ పాల్గొన్నారు.

జనరల్ పబ్లిక్ నోటీసు

యిందుమూలముగా యావన్మందికి నా క్లయింటు అయిన **శ్రీ మేనకూరు సుధాకర్‌రెడ్డి, S/o. వెంకటసుబ్బారెడ్డి,** వైకుంఠపురం, కావలి వాస్తవ్యులు, ప్రస్తుతం అమెరికా నివాసికి, G.P.A. హోల్డరు అయిన **శ్రీమతి వెట్టి రజని, W/o. శ్రీనివాసులురెడ్డి,** హైదరాబాదు వాస్తవ్యులు తెలియజేయడమేమనగా, వారి యొక్క పెద్దనాన్న గారు అయిన **శ్రీ యేటూరి రామిరెడ్డి S/o. కోశిరెడ్డి** గారు **తేది:08-11-2019న** దిగువ తెలిపిన షెడ్యూలు స్థిరాస్తిని **రూ.20,80,000/-లకు** నా క్లయింటుకు విక్రయించినారు. అందుకుగాను మొత్తమును నా క్లయింటు నుండి, పైన తెలిపిన తేదీన, సదరు యేటూరి రామిరెడ్డి గారు విక్రయ ప్రతిఫలముగా తీసుకొని, పై తేదీన నా క్లయింటు పేరుతో స్వాధీన విక్రయ అగ్రిమెంటును వ్రాయించి, దిగువ తెలిపిన స్థిరాస్తిని నా క్లయింటుకు పూర్తి హక్కులతో స్వాధీనం చేసియున్నారు. అప్పటి నుండి దిగువ తెలిపిన షెడ్యూలు స్థిరాస్తి నా క్లయింటు స్వాధీన అనుభవంలో ఉన్నది. అయితే సదరు షెడ్యూలు స్థిరాస్తిని అగ్రిమెంటు చేసుకొను సమయంలో సదరు ఆస్తి రెవెన్యూ రికార్డుల ప్రకారం చుక్కల భూమిలో వున్నందున, రిజిష్టరు చేయుటకు సాధ్యపడనందున, సదరు యేటూరు రామిరెడ్డి గారు పై తేదీన నా క్లయింటు పేరుతో స్థిరాస్తి విక్రయ స్వాధీన అగ్రిమెంటును వ్రాయించి యిచ్చియున్నారు. ఈ మధ్య గవర్నమెంటు వారు చుక్కల భూముల క్రమబద్ధీకరణలో క్రింద తెలిపిన షెడ్యూలు స్థిరాస్తిని నిషేధిత భూముల జాబితాల నుండి తొలగించిన విషయం నా క్లయింటు తెలుసుకొని, సదరు యేటూరి రామిరెడ్డి గారిని, క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని, నా క్లయింటు పేరున క్రమమైన స్టాంపుల మీద రిజిష్టరు చేయమని కోరగా, అందుకు సదరు రామిరెడ్డి గారు రిజిష్టరు చేయక కాలయాపన చేయుచున్నందున, నా క్లయింటు సదరు రామిరెడ్డి మీద గౌరవ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కావలి నందు **O.S.No. 07/2024** నంబరున దావా వేసి, షెడ్యూలు స్థిరాస్తిని నా క్లయింటు పేరున రిజిష్టరు చేయమని కోరియున్నారు. సదరు దావా పైన తెలిపిన కోర్టు నందు పెండింగులో వున్నది అని తెలియజేయుచున్నాము.

పై దావా పెండింగులో వుండగా సదరు యేటూరి రామిరెడ్డి గారు పై విషయాలను దాచిపెట్టి క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని యితరులకు విక్రయించుటకు ప్రయత్నము చేయుచున్నారని తెలిసినది.

కావున యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన షెడ్యూలు స్థిరాస్తిని ఎవరైనా క్రయ విక్రయములు చేసిన యెడల అవి నా క్లయింటుకు బద్ధగింపజాలవని మరియు చట్టరీత్యా సదరు క్రయ విక్రయములు చెల్లవని, న్యాయపరంగా అనేక కష్టనష్టములకు గురియగుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది.

స్థిరాస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు యిలాకా, కావలి సబ్-రిజిష్టరులో చేరిన, కావలి మున్సిపాలిటీ ఏరియా, కావలి బిట్-1 గ్రామ నెం.550నలో పట్టా దాఖలా, కోరుమెట్ల, సర్వే నెం.2027/2 రు విస్తీర్ణం య.5-47ట్లులో యేటూరి రామిరెడ్డి గారికి హక్కు గల య. 2-30ట్లు భూమిలో సదరు రామిరెడ్డి గారు నా క్లయింటుకు విక్రయించిన 207 అంకణములా 62 చ.అడుగులు లేక 1662 చదరపు గజములా 8 చదరపు అడుగులు గల ఖాళీ స్థలమునకు **హద్దులు: తూర్పు:** 20'-0" రోడ్డు, యీ దిశ కొలత 110'-9", **దక్షిణం:** ఆదిలక్ష్మమ్మ వగైరాల స్థలము, యీ దిశ కొలత 132'-9", **పడమర:** 20'-0" రోడ్డు, యీ దిశ కొలత 109'-9", **ఉత్తరం:** 25'-0" రోడ్డు, యీ దిశ కొలత 138'-9", రు దిశ కొలత 138'-9". ఈ హద్దులలోని పై ఖాళీ స్థలమున్నూ, సదరు స్థలమునకు గల మామూలు రాకపోకల దారి హక్కులు, తదితర సమస్త యీజిమెంటు హక్కులతో సహా.

రావినూతల నాగేంద్రబాబు
న్యాయవాది, కావలి. సెల్: 98492 29902

జనరల్ పబ్లిక్ నోటీసు

యిందుమూలముగా యావన్మందికి నా క్లయింటు అయిన **శ్రీ మేనకూరు సుధాకర్‌రెడ్డి S/o. వెంకటసుబ్బారెడ్డి,** వైకుంఠపురం, కావలి వాస్తవ్యులు, ప్రస్తుతం అమెరికా నివాసికి, G.P.A. హోల్డరు అయిన **శ్రీమతి వెట్టి రజని, W/o శ్రీనివాసులురెడ్డి,** హైదరాబాదు వాస్తవ్యులు తెలియజేయడమేమనగా, వారి యొక్క పెద్దనాన్న గారు అయిన **శ్రీ యేటూరి రామిరెడ్డి S/o. కోశిరెడ్డి** గారు **తేది:26-09-2019న** దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **రూ.15,33,200/-లకు** నా క్లయింటుకు విక్రయించినారు. అందుకు పై మొత్తమును నా క్లయింటు నుండి పైన తెలిపిన తేదీన సదరు యేటూరి రామిరెడ్డి గారు విక్రయ ప్రతిఫలముగా తీసుకొని, ఆదే రోజున నా క్లయింటు పేరుతో స్వాధీన విక్రయ అగ్రిమెంటును వ్రాయించి దిగువ తెలిపిన స్థిరాస్తిని నా క్లయింటుకు పూర్తి హక్కులతో స్వాధీనం చేసియున్నారు. అప్పటి నుండి దిగువ తెలిపిన స్థిరాస్తి నా క్లయింటు స్వాధీన అనుభవంలో ఉన్నది. అయితే సదరు షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని అగ్రిమెంటు చేసుకొను సమయంలో సదరు ఆస్తి చుక్కల భూమిలో వున్నందున, రిజిష్టరు చేయుటకు సాధ్యపడనందున, సదరు యేటూరు రామిరెడ్డి గారు నా క్లయింటు పేరుతో స్థిరాస్తి విక్రయ స్వాధీన అగ్రిమెంటును వ్రాయించి యిచ్చియున్నారు. ఈ మధ్య గవర్నమెంటు వారు చుక్కల భూముల క్రమబద్ధీకరణలో క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నిషేధిత భూముల జాబితాల నుండి తొలగించిన విషయం నా క్లయింటు తెలుసుకొని సదరు **యేటూరి రామిరెడ్డి గారిని** క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నా క్లయింటు పేరున క్రమమైన స్టాంపుల పైన రిజిష్టరు చేయమని కోరగా, అందుకు సదరు రామిరెడ్డి గారు రిజిష్టరు చేయక కాలయాపన చేయుచున్నందున, నా క్లయింటు సదరు రామిరెడ్డి మీద గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కావలి నందు **O.S.No. 484/2023** నంబరున దావా వేసి షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని రిజిష్టరు చేయమని కోరియున్నారు. సదరు దావా పైన తెలిపిన కోర్టు నందు పెండింగులో వున్నది అని తెలియజేయుచున్నాము.

పై దావా పెండింగులో వుండగా సదరు యేటూరి రామిరెడ్డి గారు పై విషయాలను దాచిపెట్టి క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని యితరులకు విక్రయించుటకు ప్రయత్నము చేయుచున్నారని తెలిసినది.

కావున యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన షెడ్యూలు స్థిరాస్తిని ఎవరైనా క్రయ విక్రయములు చేసిన యెడల అవి నా క్లయింటుకు బద్ధగింపజాలవని, చట్టరీత్యా సదరు క్రయ విక్రయములు చెల్లవని పత్రికాముఖంగా తెలియజేయడమైనది.

స్థిరాస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు యిలాకా, కావలి సబ్ రిజిష్టరులో చేరిన, కావలి మున్సిపాలిటీ ఏరియా, కావలి బిట్-1 గ్రామ నెం.2024రులో య.3.00ట్లున్నూ, సర్వే నెం.2021/1లో విస్తీర్ణం య.0-52 1/4 ట్లున్నూ, ఎరశి య.3 52 1/4ట్లులో ఉత్తర వైపున సదరు యేటూరి రామిరెడ్డికి హక్కుగల సర్వే నెం.2024 రులో య. 1-76 1/4ట్లు భూమిలో నా క్లయింటుకు విక్రయించిన 158 అంకణములా 24 చదరపు అడుగులు లేక 1226 చ.గలా 6 చ.అ.ల గల ఖాళీ స్థలమునకు **హద్దులు: తూర్పు:** 20 అడుగులు వెడల్పు గల రోడ్డు, యీ దిశ కొలత 115'-0", **దక్షిణం:** సత్యవేలు కోదండరామిరెడ్డి గారి స్థలము, యీ దిశ కొలత 90'-8", **పడమర:** యేటూరి రామిరెడ్డి గారి స్థలము, రు దిశ కొలత 115'-0", **ఉత్తరం:** యేటూరి రామిరెడ్డి గారి స్థలము, రు దిశ కొలత 97'-0". ఈ హద్దులలోని పై కొలతలు గల ఖాళీ స్థలమున్నూ సదరు స్థలమునకు గల మామూలు రాకపోకల దారి హక్కులతో సహా.

రావినూతల నాగేంద్రబాబు
న్యాయవాది, కావలి. సెల్: 98492 29902

బిడ్డకు ఆరు నెలలు తల్లిపాలు పట్టించాలి



సీతారామపురం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి రూరల్, ఆగస్టు 3: తల్లిపాలను బిడ్డకు ఆరు నెలలు తాపిస్తే సంపూర్ణ పోషక విలువలు అందుతాయని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై బాలింతలు, గర్భవతులు అవగాహన కల్పించారు. తల్లిపాలతో పిల్లలకు వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి పాల్గొని మాట్లాడారు. అపోహలు లేకుండా పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. గర్భవతి సమయం నుంచే మెరుగైన పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు, కాయగూరలను అధికంగా తీసుకోవాలన్నారు. కేంద్రాల నుంచి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమాదేవి, రత్నమ్మ, అనూష, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వైద్యురాలు స్వప్న ఆశావర్కర్స్, అంగన్‌వాడీ సిబ్బందికి తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచి కొడవటికంటి భాగ్యకుమారి పాల్గొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్‌ఎస్ రియాజ్, ఎంపీఎస్ క్రిష్టమ్మ, హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.



గండిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య

'పది'లో ప్రతిభావంతులకు నగదు అందజేత



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంగం, ఆగస్టు 3: పది పరీక్షల్లో 500మార్కులు పైన సాధించిన మర్రిపాడు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మేకల హనుమంతరావు శనివారం నగదు ప్రోత్సాహకం అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.7500, రూ.5వేలు, 500 మార్కులపైన వచ్చిన మిగిలిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500ల చొప్పున ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు నరిసింహమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు దాత మేకల హనుమంతరావును శాలువాతో సత్కరించారు.

ఆత్మకూరులో దంత వైద్యశిబిరం

ఆత్మకూరు, ఆగస్టు 3: పట్టణంలోని అవినాష్ దంత వైద్యశాలలో శనివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం దంత వైద్యనిపుణులు అవినాష్ 98 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.

'దాడి చేసి ఇళ్లను కూల్చడం దారుణం'

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 3: నందిపాడు సెంటర్‌కు చెందిన మండ్ల వెంకటేశ్వర్ల కుటుంబసభ్యులపై దాడి చేసి ఎక్స్‌కవేటర్ సహాయంతో ఇళ్లు, రేకుల షెడ్లను, చెట్లను కూల్చివేయడం దారుణమని జడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మండిపడ్డారు. శనివారం వారు కూల్చివేతలను పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాలకొండారెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఆరాటం

వరికుంటపాడు, ఆగస్టు 3: కూటమి ప్రభుత్వంలో నామినేటేడ్ పదవులపై తెలుగుదేశం నాయకుల్లో ఆశలు రెట్టింపు అవుతున్నాయి. ఇటీవల పార్టీ మండల కన్వీనర్ పదవి కోసం సోషల్ మీడియాలో చెలరేగిన అంశం మరువక ముందే శనివారం మరో అంశం తెరపైకి వచ్చింది. మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి నామినేటేడ్ పదవుల్లో భాగంగా తన పేరును పరిశీలించాలని కోరినట్లు సమాచారం. ఆయన ఉదయగిరి ఏఎంసీ చైర్మన్‌గా అవకాశ మివ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిసింది.

దళితవాడ పాఠశాలలో శుభ్‌దిన్ భోజన్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 3: శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక దళితవాడ పాఠశాలలో దాత ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పండ్లు, మిఠాయిలను భోజన సమయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులుతో పాటు ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మృతికి సంతాపం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 3: వెంకట్రావుపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గెట్టిబోయిన శ్రీనివాసులు, ఉదయగిరి పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సింగనపల్లి జానీల మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకు రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట ఓబులరెడ్డి, గూడూరు వెంకటేశ్వరరావు, శ్రీరాములు, నారాయణరెడ్డి ఉన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత విద్యార్థులదే !

వింజమూరు, ఆగస్టు 3: చౌటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బాలచెన్నయ్య మాట్లాడారు. మొక్కల సంరక్షణ బాధ్యత వారిదే అన్నారు.

పింఛన్ల పంపిణీ

వింజమూరు, ఆగస్టు 3: నందిగుంటలో శనివారం టీడీపీ నాయకులు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ గంగపట్ల వెంగయ్య, గ్రామ అధ్యక్షుడు చిలకల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బసిరెడ్డి జయంత్‌రెడ్డిలు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వారి వెంట చిలకల బాబు, మైనార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బోదాల లక్ష్మణ్ ఉన్నారు.

ఆలయ భూముల్లో అక్రమంగా మైనింగ్

ఉలవపాడు, ఆగస్టు 3 : స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయ భూముల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌కు సంబంధించిన వాహనాలను గ్రామస్థులు అడ్డగించారు. వాటిని పోలీసులకు అప్పగించి మూడు రోజులు అవుతున్నా ఇప్పటికీ కేసు నమోదు కాలేదు. కేసు నమోదు చేయాలని అధికారులు ఇప్పటికి రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్సై అనహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఆలయ పూజారి హేమంత్ శుక్రవారం నెల్లూరులో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అక్రమ మైనింగ్‌కి పాల్పడిన వ్యక్తిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పని చేయని అధికారులపై

చర్యలు తప్పవు : కాకర్ల సురేష్

కలిగిరి, ఆగస్టు 3: ప్రజలకు జవాబుదారీగా పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాకార్ల సురేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై అధికారులు అభివృద్ధి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డిపాలెం వీఆర్వో సురేష్‌పై పలువురు అవినీతి ఆరోపణలు చేయడంతోపాటు సాక్ష్యాలతోసహా నిరూపిస్తామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించగా, విచారణ జరిపి మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. ఉపాధి హామీ పనుల విషయంలో ఏపీవో శ్రీనివాసులు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ ఎంపీపీతో సహా తమను లెక్కచేయడంలేదంటూ సభ్యులు మండిపడ్డారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరికలు జారీ చేశారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఫలితాలను రైతులకు చేరవేయకపోవడంపై వ్యవసాయాధికారులు జవాబుదారీగా పనిచేయాలన్నారు. ఎంపీపీ శిరీష మాట్లాడుతూ మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతోపాటు, ఎంపీడీవో నూతన భవనానికి నిధులు మంజూరుచేయాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కలిగిరి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

● ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించండి

కొండాపురం, ఆగస్టు3: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో పి.సుజాత మండల అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూడు నెలల కాలంలో ఆరోగ్య, విద్య, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం- గ్రామపంచాయతీలు, పశుసంవర్ధక, హౌసింగ్ తదితర శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. గుడవల్లూరులో మంచినీటి సరఫరా పథకం ద్వారా అన్ని కాలనీలకు నీరు అందించలేక పోతున్నామని, ఇందుకు కారణం నీటి వనరులు లేకపోవడమేనని సర్పంచి మాచెర్ల తెలిపారు. ఈసమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, వైద్యాధికారి భవ్య, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నమ్మకం కలిగేలా వైద్యసేవలు అందించాలి : ఎమ్మెల్యే కావ్య

కావలి, ఆగస్టు3: అనుభవం కలిగిన నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది ఏరియా వైద్యశాలలో ఉన్నారని, పేదలకు నమ్మకం కలిగేలా వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యేఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఏరియా వైద్యశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి, వార్డుల్లో ఉన్న రోగులను పరామర్శించారు. ఆసుపత్రిలో ఉన్న వసతులు, అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సుమారు 900 మంది రోగులు వైద్యశాలకు వస్తున్నారని, వారికి వైద్యశాలపై నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. వైద్యశాలలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటున్న డాక్టర్లపై ఎవరూ దుష్ప్రచారం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రసూన, అభివృద్ధి కమిటీ సభ్యులు చవల రామకృష్ణ, డాక్టర్ బెజవాడ రవికుమార్, పొబ్బా సాయి విఠల్, ఏటూరి వివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వంద అడుగుల జాతీయ జెండాతో ప్రత్యేక గుర్తింపు

కావలి పట్టణంలోని అన్న క్యాంటీన్‌కు ఎదురుగా నిర్మిస్తున్న 100 అడుగుల జాతీయ జెండా, ఏర్పాటు చేయనున్న మహనీయుల చిత్రపటాలతో కావలికి ప్రత్యేక గుర్తింపు రానున్నదని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. జాతీయజెండా పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. పట్టణానికి ఓ ఐకానిక్‌గా ఉండేలా ఎమ్మెల్యే సొంత నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఈనెల 15లోగా పనులు పూర్తికావలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య పాల్గొన్నారు.



డాక్టర్లను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

జగన్ పాలనలో విద్యార్థులకు అన్యాయం : ఇంటూరి

కందుకూరు, ఆగస్టు 3: జగన్ పాలనలో పేద విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వారికి అన్యాయం చేశారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నోటు, పాఠ్యపుస్తకాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి టీఆర్ఆర్ జూనియర్ కాలేజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తాను నగదు బహుమతులను అందజేస్తానని ప్రకటించారు. కళాశాల మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు 15 ఫ్యాన్లు, ఉపాధ్యక్షుడు వడ్డెళ్ల రవిచంద్ర ఐదు ఫ్యాన్లు, ఓగూరు గ్రామ టీడీపీ నాయకుడు అల్లం వెంకటేశ్వర్లు కంప్యూటర్‌ను కళాశాలకు బహూకరిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల అవసరాల గురించి ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన : కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. టౌన్ క్లబ్ నుంచి ఆది ఆంధ్ర కాలనీ వరకు తారురోడ్డు నిర్మాణం, అదే రోడ్డులో వాగుపై వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యు. శ్రీనివాసరావు, డీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థికి పుస్తకాలు అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

ఊరూరా తల్లిపాల వారోత్సవాల నిర్వహణ

లింగసముద్రం, ఆగస్టు 3 : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని సెక్టార్ సూపర్‌వైజర్ ఎం రాధాదేవి చెప్పారు.శనివారం లింగసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ సీహెచ్ కోటమ్మ, ఆయా పూరిమిట్ల కుమారి తల్లులు పాల్గొన్నారు.

కలిగిరి : మండలంలోని చినఅన్నలూరు పంచాయతీ తూర్పుదళితపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎన్ ఉమామహేశ్వరి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం టీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు, ఏఎన్ఎంలు బీ సుజాత, జీ సౌజన్య, బీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని గుడవళ్లూరు అంగన్‌వాడీ కార్యకర్త జీ అంకమ్మ తెలిపారు. మండలకేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తల్లులు, గర్భిణీలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలేటివారిపాలెం : పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో శనివారం తల్లిపాల వారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచి అనుమోల అమరేశ్వరి, ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, క్రిష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



పలేటివారిపాలెం : తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత

కనకదుర్గమ్మ ఉత్సవాల ప్రారంభం

బిట్రగుంట, ఆగస్టు 3: బోగోలు మండలం కొండబిట్రగుంటలో శనివారం కనకదుర్గమ్మ ఉత్సవాలు గ్రామ పెదకాపు కాకు మాల్యాద్రి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో వేపకొమ్మ కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శిల్పి కనకదుర్గమ్మ ప్రతిమను చెక్కి జలాధివాసం చేశారు. రాత్రి పడమర పొలిమేర్లలో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో కనకదుర్గమ్మకు కుంభాభిషేకాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

'ఎస్సీల వర్గీకరణ సమంజసం కాదు'

అల్లూరు, ఆగస్టు 3 : రాజకీయ లబ్ధి కోసం ఎస్సీల వర్గీకరణ సమంజసం కాదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐకమత్యంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కులాల్లో విభేదాలు సృష్టించడం కోసం ఈ వర్గీకరణను తీసుకువచ్చారన్నారు. ఈ వర్గీకరణ కేవలం రాజకీయ లబ్ధికి తప్ప ఇతరత్రా ఉపయోగాలు ఏమీ లేవన్నారు. ఉమ్మడి రిజర్వేషన్ మాదిరిగానే వర్గీకరణలో సమన్యాయం, సామాజిక న్యాయం ఉండాలన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం

కొండాపురం : పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణపై అవగాహన ఎంతో అవసరమని ఎంఈవో-1 కే.రవికుమార్, ఎంఈవో-2 ఆనందరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల విద్యా వనరులకేంద్రంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించి, అధ్యక్ష, సభ్యుల వివరాలను అదేరోజు మండల విద్యావనరుల కేంద్ర కార్యాలయంలో అందచేయాలన్నారు.

వాటరు ట్యాంకుల క్లోరినేషన్

పలేటివారిపాలెం : మండలంలోని జమీన్‌ఉప్పలపాడు, పోలినేనిపాలెంలలో వాటర్‌ట్యాంక్‌లను శనివారం సర్పంచులు వీ. వెంకటేశ్వర్లు, ఏ. అమరేశ్వరి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందితో క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

కావలి : పట్టణంలోని ఏరియా వైద్యశాల వద్ద శనివారం జనసేన సభ్యత్వ నమోదు జరిగింది. కందుల లక్ష్మీ, కవిత తదితర మహిళల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వీరమహిళా కోఆర్డినేటర్ వెంకటరత్నం యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి గురుకుల కిషోర్, సీనియర్ నాయకులు మల్లికార్జునయాదవ్, జమీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీరమహిళలు ఇందిర, శశికళ, హసీనా, నాయకులు ఎస్. వెంకటసుబ్బయ్య, ఆలా శ్రీనాథ్, తోకల వెంకటేశ్వర్లు,పీ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాలు హైరింగ్ సెంటర్లలో ఉంచాలి

కందుకూరు : ప్రభుత్వం సబ్సిడీతో అందజేసిన వ్యవసాయ యంత్ర పరికరాలన్నీ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో ఉంచాలని మండల వ్యవసాయాధికారి వీ రాము తెలిపారు. శనివారం మండలంలోని పాలూరు రైతు సేవాకేంద్రంలోని కమ్యూనిటీ హైరింగ్‌సెంటర్ పరిధిలో అందజేసిన యంత్ర పరికరాలను ఆయన పరిశీలించారు. పరికరాలను ఇతరులకు అమ్మకాలు జరిపితే రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

అవినాష్‌బాబుకు డాక్టరేట్



కావలి రూరల్ : మండలం పూలదొరువు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి అవినాష్‌బాబు డాక్టరేట్ అందుకున్నారు. తమిళనాడులోని వేలూరు విట్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన 39వ స్నాతకోత్సవంలో అవినీష్‌బాబు డాక్టరేట్ అందుకోవటం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు సుధాకర్, రోహిణి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విట్ ప్రొఫెసర్ మాధురి నేతృత్వంలో మెటీరియల్ సైన్స్‌లో 'ఎనర్జీ కన్వర్షన్ అండ్ ఎనర్జీ స్టోరేజ్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడంతో పలువురు అభినందించారు.

బీజేపీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి : వంశీ

కందుకూరు : బూత్ కమిటీలను బలోపేతం చేయటం ద్వారా బీజేపీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆపార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధరరెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవులలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సముచిత న్యాయం జరిగేలా కృషిచేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు యరబోలు రాజేష్, పీవీ కృష్ణారెడ్డి, జొన్నాదుల రాఘవయ్య, సురేష్, మన్నేపల్లి వరప్రసాదరావు, సుధాకర్, డేవిడ్ కరుణ, తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 6,94,971

పలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,94,971 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు

ఉచిత దంత వైద్యశిబిరం

కావలిటౌన్ : స్థానిక బాలకృష్ణారెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం ఉచిత దంత వైద్య శిబరం జరిగింది. పవిత్ర డెంటల్ ఆసుపత్రి వైద్యురాలు పవిత్ర విద్యార్థులకు, స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



ఆరోగ్యకేంద్రంలో రోగులను పలకరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 3: సర్వేపల్లి నియోజకవర్గంలోని ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వెంకటాచలం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రోగులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీకి మినరల్ వాటర్ ప్లాంట్, సీహెచ్‌సీలకు జనరేటర్లు, వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వెంకటాచలం సీహెచ్‌సీకి అదనపు మందుల సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే వెంకటాచలంతోపాటు పొదలకూరు సీహెచ్‌సీల్లో పోస్టుమార్టం సేవలు ప్రారంభం కాబోతున్నాయన్నారు. రోగులకు మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని అందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు గుమ్మడి రాజాయాదవ్, కుంచి శ్రీనివాసులు యాదవ్, సీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు తదితరులున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన

విద్యార్థులు బాగా చదువుకుని సమాజంపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల తర్వాత టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, కుంచి శ్రీనివాసులు యాదవ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ఎన్డీఏ కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డికి టీడీపీ నేతల అభినందనలు

విడవలూరు, ఆగస్టు 3: అండర్ టేకింగ్స్ పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మండలానికి చెందిన టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి శుక్రవారం అయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

● **కొడవలూరు:** మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నెల్లూరు నగరంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఆయన వెంట టీడీపీ మాజీ ఎస్సీఎల్ జిల్లా అధ్యక్షుడు పాటూరి రవీంద్రబాబు, మండల మాజీ టీడీపీ ప్రధాన కార్యదర్శి పాటూరి రమేష్ తదితరులున్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

వెంకటాచలం, ఆగస్టు 3: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని యానాది గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు అన్నారు. వెంకటాచలంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూదురు కేశవ రామ్, మలికి చెంచయ్య, చలంచెర్ల రవీంద్ర, గజేంద్ర తదితరులున్నారు.

గీత కార్మికుడికి ఆర్థికసాయం

మనుబోలు, ఆగస్టు 3: ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న గీత కార్మికుడు ఉప్పాల వెంకటేశ్వర్లు గౌడ్‌కు శనివారం జిల్లా కల్లుగీత కార్మికుల పారిశ్రామిక సంఘం, గౌడ్ సేవాసమితి ట్రస్టు తరపున రూ.10వేలు ఆర్థిక సాయం ఆ ట్రస్టు అధ్యక్షుడు తోట ప్రభాకర్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంపలూరు శ్రీనువాసులు గౌడ్, జిల్లా యువత అధ్యక్షుడు తాళ్ళ రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ పీహెచ్‌సీ తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 3: మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని జిల్లా అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ ఎస్కే ఖాదర్‌వలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు టీబీ రోగులకు అందుతున్న వైద్యసేవలు, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురించి తెలుసుకుని పలు సూచనలిచ్చారు.

కామాక్షితాయికి ప్రత్యేక పూజలు



బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 3: జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో ఆషాడమాస సారె కార్యక్రమం శనివారం రాత్రి ముగిసింది. ముత్తైదువులు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అర్చకులు అలంకార మండపంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదములు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కృష్ణపట్నంలో పచ్చదనం-పరిశుభ్రత



పనులు ప్రారంభిస్తున్న ఫౌండేషన్ హెడ్ రాజేష్

ముత్తుకూరు, ఆగస్టు 3: అదాని కృష్ణపట్నం పోర్టు సహకారంతో అదాని ఫౌండేషన్, కృష్ణపట్నం పంచాయతీ సంయుక్తంగా శనివారం కృష్ణపట్నం గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోర్టు కృష్ణపట్నంలోని శివాలయం ప్రాంతం నుంచి పనులను ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, టీడీపీ నాయకులు ఏకొల్లు కోదండరామయ్య, బొనిగి ఆనందయ్య కలిసి ప్రారంభించారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువలను శుభ్రంచేయడం, మురుగునీరు నిల్వలేకుండా చేయడంతోపాటు గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాగాల శివకృష్ణ, శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి మస్తానయ్య, వీఆర్‌వో అవినాష్, అదాని ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్‌బాబు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తోటపల్లిగూడూరు, ఆగస్టు 3: సీజనల్ వ్యాధులపై గ్రామ పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఉప్పల స్వర్ణలత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఎంపీడీవో బాలాజీ పర్యవేక్షణలో పంచాయతీరాజ్ ఆరోగ్యశాఖ వ్యవసాయ, జలవనరుల, గృహ నిర్మాణ శాఖ, విద్యా, ఆరోగ్యం, ఉపాధిహామీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు వారు చేస్తున్న పనులను వివరించారు. చింతోపు గ్రామంలో పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఇన్‌చార్జ్ అజీజ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కంజీనీలమ్మ, పంచాయతీ రాజ్ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్వైజర్ వరలక్ష్మీ, పాల్గొన్నారు.

చిన్మయానంద మహాసమాధి వేడుకల ప్రారంభం

ఇందుకూరుపేట, ఆగస్టు 3: మండలంలోని కొత్తూరు విద్యాలయంలో చిన్మయానంద మహాసమాధి వేడుకలను శనివారం విద్యాలయ స్వామీజీ హరీష్, చైతన్య, కరస్పాండెంట్ బద్దెపూడి హరిత, ప్రిన్సిపాల్ చంద్ర ప్రారంభించారు. అనంతరం చిన్మయానంద స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం భువనేశ్వరి అమ్మవారి ఆలయంలో గోవులకు పశుగ్రాసం అందించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

మినగల్లు రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలింపు

● ట్రాక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 3: మండలంలోని మినగల్లు ఇసుక రీచ్ నుంచి శనివారం వేకువజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ తోపాటు డ్రైవర్ గౌతమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నాలుగు రోజులుగా మినగల్లు రీచ్ నుంచి అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు అక్రమంగా ఇసుక తరలించినట్టు సమాచారం మేరకు బుచ్చి సీఐ హైమారావు, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ తోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ట్రాక్టరు, ఎడ్ల బండి స్వాధీనం

●**కోవూరు:** పెన్నానది తీరం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెన్నానది నుంచి ఇసుకను పగటిపూట ఎడ్లబండ్లలో మోడేగుంట గ్రామానికి తరలించి రాత్రి సమయంలో ట్రాక్టర్లలో దూర ప్రాంతాలకు పంపుతున్నట్లు ఎస్ఐ రంగనాథగౌడ్ గుర్తించారు. వేకువజామున ఆయన సిబ్బందితో కలిసి దాడిచేసి ఓ ట్రాక్టరు, ఓ ఎడ్ల బండిని స్వాధీన పరచుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రీచ్‌ను పరిశీలించిన అధికారులు

పొదలకూరు : విరువూరు ఇసుక రీచ్‌ను శనివారం మైనింగ్ సూపర్‌వైజర్ సుధాకర్‌రావు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ దేవిసింగ్ ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ ఎటువంటి వాహనాలు లేవని, ఇసుక అక్రమ రవాణా జరగడంలేదని నిర్ధారించారు. అలాగే గ్రామ సర్పంచ్, వీఆర్వో హరికృష్ణ, గ్రామస్థులు కూడా ఇసుక రవాణా జరగడం లేదని తెలిపారన్నారు.

వనమహోత్సవం



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న డీఈవో రామారావు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 3: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు తల్లి పేరుతో మొక్కనాటే కార్యక్రమాన్ని బుచ్చిలోని గోపాల కృష్ణయ్య స్కూల్లో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు వారి ఇళ్లలో నాటేందుకు మొక్కలు పంపిణీ చేశారు. వారధి ఫౌండేషన్ చైర్మన్ రంగనాధ్ సహకారంతో అందజేసిన మొక్కల నాటే కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వెంకట రమణబాబు, ఎంఈఓ 2 పీవీ రత్నం, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తిరివీధి సుబ్రమణ్యం, స్కూలు కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్, ప్రిన్సిపల్ సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడికి సన్మానం

కోవూరు, ఆగస్టు 3: పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డిని శనివారం ఉన్నం ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు స్థానిక శాంతినగర్‌లోని ఆయన ఇంటికి చేరుకుని ఘనంగా సన్మానించారు. రక్తదానం, నేత్రాల సేకరణలో దేవిరెడ్డి సురేష్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని ట్రస్టు చైర్మన్ నరసింహారావు అన్నారు. సురేష్‌రెడ్డిని పలువురు అభినందించారు.

గిరిజనులపై వైసీపీ నేతల దాడి

● ఎస్‌ఐకి ఫిర్యాదు

విడవలూరు, ఆగస్టు 3: తీసుకున్న పొలానికి కౌలు కట్టలేదని టీడీపీకి చెందిన గిరిజనులపై వైసీపీ గ్రామ సర్పంచు అరగల వినోద్, అతని బంధువులు దాడిచేసిన సంఘటన గురువారం రాత్రి చౌకిచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఈమేరకు బాధితులు శనివారం స్థానిక ఎస్ఐ సాయిప్రసాద్‌కి ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

కనకదుర్గమ్మకు శాకాంబరి అలంకారం



నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 3 : ఆషాడ మాసం సందర్భంగా నగరంలోని వైకుంఠపురం కాశీనాయన ఆశ్రమంలో వెలసి ఉన్న కనకదుర్గమ్మకు శనివారం పండ్లు, కూరగాయలతో శాకాంబరి అలంకారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులతో సామూహిక లలిత సహస్ర నామ పారాయణం, భాగవత కథలు ప్రవచనం, భజనలు జరిగాయి. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ముత్తైదువులు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్య క్రమాలను నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, రజనీ, భార్గవి, పద్మజ, అనిత, మహాలక్ష్మి, హేమచంద్ర, కృష్ణారెడ్డి, మురళీ, మహేష్, వెంకటేష్, పర్యవేక్షించారు.

చెస్ క్రీడాకారుడికి ఫీడే ర్యాపిడ్ రేటింగ్

నెల్లూరు(విద్య), ఆగస్టు 3 : నెల్లూరుకు చెందిన చెస్ క్రీడాకారుడు షేక్.అభిషేక్ అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ సాధించారని ఏపీ చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. నగరంలోని బాలాజీనగర్ కేబీ చెస్ అకాడమీలో శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదివే అభిషేక్ చిన్నతనం నుంచి అన్ని విభాగాల్లో రాణిస్తూ అంతర్జాతీయస్థాయిలో రేటింగ్ క్రీడాకారుడిగా గుర్తింపు పొందడం అభినం దనీయన్నారు. తల్లిదండ్రులు మస్తాన్, చంద్రికల ప్రోత్సాహం, కోచ్ కిషోర్ ప్రత్యేక శిక్షణతోనే ఇది సాధ్యమయ్యిందన్నారు. ఇదే స్ఫూర్తితో చెస్‌లో మరింత ఉత్తమంగా రాణించి మున్ముందు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేబీ చెస్ అకాడమీ డైరక్టర్స్ కిషోర్, దుర్గాభవానీలు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

● మాలమహానాడు నేతలు



మాట్లాడుతున్న వాదనాల వెంకటరమణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 3 : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ అన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 70 ఏళ్ల నుంచి ఎస్సీ రిజర్వేషన్ కొనసాగుతోందన్నారు. ఎస్సీ జనాభా పెరిగినందున రిజర్వేషన్‌ను కనీసం 30 శాతానికి పెంచాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాలలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నేతలు కమతం అశోక్, శైలేంద్రబాబు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 3: తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి వెల్లడించా రు. నారాయణ ఆసుపత్రిలో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సంద ర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు నారాయణ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయన్నారు. నారాయణ మాతృసేవాపథకం ద్వారా ఉచిత వైద్య చికిత్సలు పొందుతున్న గర్భిణులు తల్లిపాల విశిష్టత గురించి తెలుసుకోవాలన్నారు. నారాయణ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ మాట్లాడుతూ మాతృసేవా పథకం ద్వారా నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అన్ని రకాల డెంటల్ చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ తల్లిపాలు తాగటం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. తల్లిపాల విశిష్టతను తెలిపే నాటికతో పాటు క్విజ్ ప్రోగ్రాంలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, డాక్టర్ అరుణ్‌కాంత్, డాక్టర్ సతీష్, డాక్టర్ వనజకుమారి, నారాయణ ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పార్థసారధిని కలిసిన జేఏసీ చైర్మన్ మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 3 : రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారధిని శనివారం జిల్లా హౌసింగ్ హెడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ జేఏసీ చైర్మన్ ఎన్‌వీఎం మనోజ్‌కుమార్ నెల్లూరులో కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ పదోన్నతుల ఫైలు గురించి చర్చించారు. పదవీ విరమణ వయ స్సును 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి సీఎం ప్రత్యేక కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, హౌసింగ్ ప్రిన్సిపల్ కార్య దర్శి అజయ్‌జైన్, ఎండీ రాజబాబు కు ఫోన్ చేసి పై రెండు సమస్య లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ లు, డీఈలు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

● సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి



మాట్లాడుతున్న అరిగెల సాయి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 3 : నెల్లూరు నగరంలోని శ్రీసాయిబాబా రైసుమిల్లు యాజమాని శ్రీరామ్ శేఖర్‌బాబు రైతులకు చెల్లించాల్సిన నగదుపై కలెక్టర్ ఆనంద్ స్పందించి తక్షణం నగదు ఇప్పించి న్యాయం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారాయణరెడ్డిపేట, నెల్లూరు రూరల్‌లోని పలు గ్రామాలు, గూడూరు తదితర గ్రామాలకు చెందిన 434 మంది రైతులు పండించిన రూ.10 కోట్ల విలువైన ధాన్యాన్ని నెల్లూరు నగరంలోని శ్రీసాయిబాబా రైస్‌మిల్లు యజమానికి విక్రయించారన్నారు. సదరు యజమాని తాత్కాలికంగా రూ.5 కోట్లకు పైగా చెల్లించారని, మిగిలిన మొత్తం చెల్లించాల్సి ఉందన్నారు. అయితే తమ రైసుమిల్లు నుంచి నిల్వ ఉన్న ధాన్యాన్ని అమర్‌విక్రం, సుధాకర్, శ్రీధర్, రాజశేఖర్, శివ అనే రైస్‌మిల్లు నిర్వాహకులు దొంగతనంగా ఎత్తుక పోయారని, దీంతో మిగిలిన డబ్బును ఇచ్చేందుకు తనవల్ల సాధ్యం కాదని చెబుతున్నారన్నారు. దీంతో రైతులు ఆందోళ వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయమని మంత్రులు, పౌరసరఫరాల శాఖ అధికారులను వేడుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ చొరవ చూపి దొంగతనంగా ధాన్యాన్ని ఎత్తుకెళ్లిన వారిపై కేసులు నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వాటంబేటి నాగేంద్ర, లీలామోహన్, భరత్, మస్తానయ్య, బాబు, నరసింహనాయుడు, చైతన్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని పరుగులు తీయిస్తా

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఆగస్టు 3 : నెల్లూరు రూరల్లో ఇప్పటి వరకు జరిగినదానికంటే పదింతలు ఎక్కువ అభివృద్ధిని చేసి చూపిస్తానని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం 30వ డివిజన్ శ్రామిక నగర్‌లో రూ.33 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుబడిన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి రఘు, కూకటి హరియాదవ్, అత్తివరపు యానదయ్య, బత్తల కృష్ణయ్య, పల్నాటి మస్తాన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించండి

నెల్లూరు(విద్య) : జన్మనిచ్చిన తల్లిదండ్రులను, దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కష్టపడుతున్న సైనికులను గౌరవించుకోవాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఉచిత పాఠ్య, నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థినులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు, డీఈఈవో మధుబాబు, మాజీ మేయర్ భానుశ్రీ, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు వీ.జ్యోతి, కార్యదర్శి కె.కుసుమకుమారి, డాక్టర్ ఎన్.జయలక్ష్మి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.కొండయ్య, టీడీపీ నేత రాజానాయుడు, పాల్గొన్నారు.

'అటవీ శాఖ'కు డిప్యూటీ సీఎం ఫొటో అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 3: నెల్లూరు డివిజన్ అటవీ శాఖ అధికారులకు శనివారం జనసేన పార్టీ నాయకులు రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోను అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటోతో పాటు డిప్యూటీ సీఎం ఫొటోను ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పవన్‌కళ్యాణ్ ఫొటోను ఏర్పాటు చేసేలా చూస్తున్నామన్నారు.



ఆండాళ్ అమ్మవారికి ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 3 : తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో శనివారం రాత్రి ఆండాల్ అమ్మవారికి ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి తిరువాడిప్పూడి ఉత్సవాల్లో భాగంగా ఉదయం తిరుమంజనం, సాయంత్రం మాలలు మార్పు, ఊంజల్‌సేవ జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మాలను ఉభయ దాతలు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

మహేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలి

● సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 3 : కెఎన్‌ఆర్ పాఠశాలలో సన్‌షేడ్ కూలిన ఘటనలో మృతి చెందిన విద్యార్థి గురుమహేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కెఎన్‌ఆర్ పాఠశాలకు వెళ్లి సంఘటన జరిగిన విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కనీసం రక్షణ చర్యలు తీసుకోకుండా స్కూలు భవనాన్ని నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, పలిగిలి చిన్నయ్య, తాటిపర్తి రఘు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం అమరత్వానికి సంకేతం

● ఆర్ఐవో శ్రీనివాసులు



అవయవదానంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్ఐవో

నెల్లూరు(విద్య), ఆగస్టు 3 : అవయవదానం ద్వారా మరో మనిషి జీవితంలో వెలుగులు ప్రసాదించి తద్వారా అమరత్వాన్ని పొందవచ్చని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. అవయవ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీకే డబ్ల్యూ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవయవదానం అమరత్వానికి సంకేతమని, ప్రతి ఒక్కరూ తమ అవయవాలను దానం చేయడంలో వెనుకంజ వేయకూడదన్నారు. అనంతరం అవయదానానికి పాటించాల్సిన నియమాలు, పద్ధతులు, పరిమితులపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయిం చారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్‌వీ. సుధీర్‌కుమార్, డీఎస్‌వో డాక్టర్ ఎస్.భాస్కర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ జీ.కరుణకుమారి, బీ.ప్రసన్న, టీ.భారతి, అధ్యాపకులు డాక్టర్ వెంకటరావు, కృష్ణతులసి, శ్రీధర్, శివయ్య పాల్గొన్నారు.

పింఛన్లపై అవగాహన పెంచుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి

నెల్లూరురూరల్, ఆగస్టు 3 : వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ పొందే అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ న్యాయాధికారి, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కే వాణి అన్నారు. శనివారం నెల్లూరు రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఒంటరి మహిళలకు, వితంతువులకు పింఛన్లు పొందే అవకాశం ఉందన్నారు. వీరి అర్హతలను బట్టి ప్రభుత్వాలు సామాజిక పింఛన్లు అందించాలని చెప్పారు. ఎక్కడైనా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పేద, నిరుపేదలకు తమ సంస్థ ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తుందని చెప్పారు. న్యాయ వ్యవస్థలో చిన్న, పెద్ద తేడాలుండవన్న విషయాన్ని గ్రహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎల్‌డీవో డీ వసుమతి, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5



తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 4 ఆగస్టు 2024

ఆదివారం ప్రత్యేకం

■ ఇంటర్వ్యూ

తిరుమల తిరుపతి దేవస్థానాల ఈవో అన్నది ఒక విశేషమైన హోదా. ఒక పవిత్రమైన బాధ్యత. ఐఏఎస్ కెరీర్‌లో అరుదైన అవకాశం. దేశం నలుమూలలనుంచీ వచ్చే భిన్నప్రాంతాల, భిన్న భాషల, భిన్న ఆహారపు అలవాట్లున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా సంతృప్తికరంగా శ్రీవారి దర్శనం చేయించడం నిత్య సవాలు. తిరుమలలో చిన్న కదలిక కూడా జాతీయ వార్తగా వైరల్ అయిపోతుంది. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ సకల విభాగాల యంత్రాంగాలనూ నడిపించాలి. టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన జె.శ్యామలరావు నెలన్నరగా తిరుమల అంతా సుడిగాలిలా తిరిగారు. ప్రతిదీ ప్రత్యక్షంగా పరిశీలించి ఆనుపానులు తెలుసుకున్నారు. ఆ తర్వాతే సమీక్షలకు దిగి సరిదిద్దే చర్యలకు ఉపక్రమించారు. పరిశీలన, అవగాహన, గుర్తించిన లోపాలు, చేయబోయే మార్పుచేర్పుల గురించి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా సంభాషించారు. అందులోని ముఖ్యాంశాలు....

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి పటిష్ఠమైన ఐటీ అవసరం



జె.శ్యామలరావు

1997 బ్యాచ్ ఐఏఎస్, సొంతూరు కాకినాడ. 11ఏళ్లు అసోంలో విధులు. 2009-11 మధ్య విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు. మెడికల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ బోర్డులకు ఎండీగా చేశారు. కమర్షియల్ టాక్స్ జీఎస్టీ కమిషనర్‌గానూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శిగానూ విధులు నిర్వహించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి టీటీడీ ఈవోగా జూన్ 16న వచ్చారు.

లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి

క్యూలైన్లలో భక్తులకు అవస్థల్లేకుండా చర్యలు

వారాంతపు క్యూలైన్లపై ప్రత్యేక శ్రద్ధ

ఎక్కువమంది భక్తులు సంతృప్తికరంగా శ్రీవారిని దర్శించుకునేలా చేయడమే నా ప్రథమ ప్రాధాన్యం. ఎలాంటి ప్రణాళికలు లేకుండా వచ్చే భక్తులతోనే క్యూలైన్లు పెరిగిపోతున్నాయి. వారాంతపు క్యూలైన్లలో భక్తులు ఇబ్బందిపడకుండా నారాయణగిరిలో అదనపు షెడ్ నిర్మించాలని నిర్ణయించాం. ఇక్కడ 5నుంచి 6వేల మంది భక్తులు కూర్చోవచ్చు.ఆలయంలో సేవలు, కైంకర్యాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటే అధిక సంఖ్యలో భక్తులకు దర్శనం కల్పించవచ్చని అర్థమయ్యింది. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా క్యూలైన్లలో భక్తుల కదలికలను పరిశీలించి సంఖ్యను నియంత్రించవచ్చు. ఇక, భక్తులు అధిక సమయం క్యూలైన్‌లో నిలబడి ఇబ్బందిపడే అవసరం లేకుండా స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లు వారానికి 1.47 లక్షలకు పెంచాం. దీనిని గతంలోలా 1.67 లక్షలకు పెంచుతాం. ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే బయటకు వ్యాపించిన క్యూలైన్లను తనిఖీ చేసినప్పుడు చాలా లోపాలు కనిపించాయి. అక్కడ అందించే ఆహారపదార్థాల నాణ్యత బాగాలేదని, కనీసం తాగు నీరు ఇచ్చేవాళ్లు కూడా లేరని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరనే ఫిర్యాదులు వచ్చాయి. పిల్లలకు పాలు అందడం లేదని ఓ భక్తురాలు నా దగ్గరకు వచ్చి ఏడ్చింది. సీఎంగారు కూడా ఇవే సమస్యల మీద దృష్టి పెట్టమని చెప్పారు. అన్నప్రసాదాల వితరణకు ఓ పద్ధతి ప్రకారం వ్యవస్థ లేదని గుర్తించా. ఈ క్రమంలో బయటికి వ్యాపించిన క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయంగా ఆహార పదార్థాలు అందించేందుకూ, అందేలా పర్యవేక్షించేందుకూ ప్రత్యేకంగా ముగ్గురు ఏఈవో స్థాయిల్లో అధికారులను మూడు షిఫ్టుల్లో ఉండేలా నియమించా. అలాగే బయట క్యూలైన్ మొత్తానికి కలిపి 3 శాశ్వత ఫుడ్‌కౌంటర్లు ఏర్పాటు చేశాం. వారాంతాల్లో పర్యవేక్షణకు ఎస్వీబీసీ సీఈవోకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ఫుడ్ పెట్టడం లేదనే విమర్శలకు అవకాశం ఇవ్వకుండా ఎక్కడ, ఎప్పుడు ఫుడ్ అందించామనే సమాచారం తెలిసేలా జీపీఎస్ ఇనేబుల్ కెమెరాల ద్వారా తీసిన ఫొటోలు సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసే వ్యవస్థను తీసుకువచ్చాం. బయటి క్యూలైన్ల వద్ద మరుగుదొడ్ల సమస్యను అధిగమించేందుకు మొత్తం ఆరు టాయిలెట్లు భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చాం.

పారిశుధ్య నిర్వహణ తీరు మారాలి

ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణ సంతృప్తికరంగా లేదు. కాంట్రాక్టర్లు సరిపడినంతమంది సిబ్బందిని పెట్టడం లేదు, కావాల్సిన మెటీరియల్ ఇవ్వడం లేదు. పనితీరుపై పర్యవేక్షణ ఇప్పటి వరకు లేకుండా పోయింది. ఈ పరిస్థితులు గమనించి మార్పులు చేస్తున్నాం. మొహమాటాలకు తావులేదు. పారిశుధ్యం సరిగా లేకపోతే కాంట్రాక్టు రద్దుచేస్తామని హెచ్చరిస్తున్నాం.

మరింత శుద్ధజలం

తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల నిషేధం తర్వాత చాలా మంది భక్తులు జలప్రసాద కేంద్రాలపై ఆధారపడుతున్నారు.ఎప్పటికప్పుడు జలప్రసాద కేంద్రాల నుంచి శాంపిల్స్ తీసుకుని పరీక్షిస్తున్నాం.అలాగే గాజుబాటిళ్ల విక్రయంలో దుకాణదారుల తీరుపై వస్తున్న విమర్శలు పరిశీలించి హెచ్చరించాం. నిబంధనలను ఉల్లంఘిస్తే దుకాణాలను సీజ్ చేస్తాం. నీటి సరఫరాకు ప్రముఖ సంస్థలను కూడా ఆహ్వానిస్తున్నాం. ప్రస్తుత ధరకే విక్రయించేందుకు ముందుకు వస్తే లైసెన్సులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం.

కాలినడక భక్తులకు టోకెన్లు

గతంలో అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో నడిచివచ్చే భక్తులకు ప్రత్యేకంగా దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవాళ్లు. అయితే వాటిని తొలగించారు. నేను వచ్చాక శ్రీవారిమెట్టులో తిరిగి టోకెన్లు జారీ చేస్తున్నాం. అలిపిరి మార్గంలో కూడా ఇవ్వాలంటూ చాలామంది అడుగుతున్నారు. అయితే ఇప్పటికే చాలా రకాల దర్శనాలు అమల్లో ఉన్నాయి. ఈ క్రమంలో వీటి జారీ వల్ల ఏదైనా సమస్య వస్తుందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఆలయ క్యూలైన్ల నిర్వహణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ మార్గంలో టోకెన్ల జారీపై దృష్టి పెడతాం. స్థానికులకు దర్శనం కల్పించడంపై కూడా త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

లడ్డూకి పూర్వ వైభవం

లడ్డూ నాణ్యత పెంపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పోటు కార్మికులు, అధికారులు, గతంలో పనిచేసి వెళ్లిన అధికారులతో సమీక్షలు నిర్వహించాం. లడ్డూ తయారీలో ముఖ్యమైనది నెయ్యి. రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ఉండాలి. గతంలోకన్నా ఇప్పుడు వాడుతున్న నెయ్యి నాణ్యతలో లేడావుందని గుర్తించాం. ఇకపై క్వాలిటీ నెయ్యి రావాలని సంబంధిత టెండరుదారులను హెచ్చరించాం. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్న ఓ సంస్థపై నిషేధం విధించాం. అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేకమైన ల్యాబ్‌ను తిరుమలలోనే ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న ముడిసరుకుల నాణ్యతను పరిశీలిస్తాం. మంచి నాణ్యమైన సరుకులు వినియోగించడం ద్వారా లడ్డూకి పూర్వవైభవం తీసుకురావచ్చు.

అన్నదానంలో మోడరన్ కిచెన్

అన్నప్రసాదాల్లోని అన్నం ముద్ద కడుతోందని, బియ్యంలో నూకలు కలుస్తున్నాయని చాలా ఫిర్యాదులున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇటీవల ఏపీ, తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులతో సమీక్ష నిర్వహించాం. నాణ్యత పర్యవేక్షణకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశాం. అసోసియేషన్ నుంచి ఒకరు,టీటీడీ అన్నప్రసాద విభాగం నుంచి ఒకరు, కొనుగోళ్ల విభాగం నుంచి మరొకరు బియ్యం నాణ్యతను నిత్యం పరిశీలిస్తారు. నాణ్యత లేదని స్పష్టమైతే ఆ బియ్యం ఏ రైస్‌మిల్ నుంచి వచ్చిందో గుర్తించి ఆ మిల్లర్‌పై అసోసియేషన్ నిషేధం విధించాలని కోరాం. దానికి అసోసియేషన్ సభ్యులు కూడా అంగీకరించారు. అలాగే వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు సంతృప్తికరంగా నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో అన్నప్రసాదాలు అందించేందుకు అతిపెద్ద క్యాటరింగ్ సర్వీస్ సంస్థ 'కాంపస్' సహకారం తీసుకోబోతున్నాం. స్టోర్, కిచెన్, పారిశుధ్యం, సర్వింగ్, ట్రాన్స్‌పోర్టు ఇలా అన్నిటిలోనూ వాళ్లు కొన్ని సూచనలు చేస్తారు. వీళ్లు ఉచితంగానే ఈ సేవలను టీటీడీకి అందించబోతున్నారు. అన్నప్రసాదాల నాణ్యత పెంపుకోసం ఫుడ్‌టెక్నాలజీ, హోటల్ మెనేజ్‌మెంట్, క్యాటరింగ్ నిపుణులతో కూడా చర్చించాం.వంటశాలలో ఉన్న పాత యంత్రాలను తొలగించి అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు చేస్తాం. సిబ్బందిని కూడా సరిపడా పెంచుతాం. రానున్న 25 ఏళ్ల వెనక్కి తిరిగి చూసే అవకాశం లేకుండా ఆధునాతన కిచెన్‌ను సిద్ధం చేస్తాం.

ఐటీ విభాగం వీక్

దర్శనం, వసతి, ఆర్జితసేవల ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ తీరును పరిశీలిస్తున్నాం. ముఖ్యమైన ఐటీ విభాగం చాలా బలహీనంగా ఉంది. ఐటీలోని లోపాలను అవకాశంగా మార్చుకుని ఒకే మొబైల్, ఈమెయిల్ ద్వారా వందల సంఖ్యలో లక్కీడిప్ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవడాన్ని గమనించాం. వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసుకుని దర్శనాలు, సేవలు పొందుతున్నారు. అలాగే నకిలీ ఆధార్ నెంబర్లతోనూ టికెట్లు, గదులు తీసుకుంటున్నారు. శ్రీవాణి టికెట్లు కూడా ఫేక్ ఐడీలతో బుక్ చేస్తున్నారు. ఇప్పటికే పలు ఫోన్‌నెంబర్లను, మెయిల్స్‌ను బ్లాక్ చేయడంతో పాటు ఫేక్ ఆధార్ నెంబర్లతో, ఒకే నెంబరు, మెయిళ్ల ద్వారా చేసుకున్న కొన్ని బుకింగ్స్‌ను రద్దు చేశాం. ఇక, ఫేక్ ఆధార్‌లను అరికట్టేందుకు ఆధార్ సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడాం. ప్రత్యేకంగా తయారు చేసిన అప్లికేషన్‌తో ఆధార్ నిజమైనదా కాదా అని నిర్ధారించుకునే వ్యవస్థను మరో 20 రోజుల్లో ఏర్పాటు చేయబోతున్నాం. ఐడీని మార్చడం పెద్ద క్రైం. ఎట్టిపరిస్థితిలో వీళ్లను విడిచిపెట్టకూడదు. భవిష్యత్తులో ఐటీ విభాగాన్ని పటిష్టం చేసి అక్రమాలకు అవకాశం లేకుండా చేస్తాం. అనుభవం కలిగిన మంచి అధికారి పర్యవేక్షణలోకి ఐటీ విభాగాన్ని తీసుకురాబోతున్నాం. ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీలో దళారీలను అరికట్టేందుకు ఫొటోతో టోకెన్ ఇచ్చే విధానాన్ని కూడా అమలుచేస్తున్నాం.

ఆర్గానిక్ నైవేద్యాల రుచిపై ఫిర్యాదులు

శ్రీవారికి నివేదించే నైవేద్యాలను ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ముడిసరుకులతో సమర్పించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ప్రసాదాలు రుచికరంగా లేవనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై కూడా చర్చించాం. అసలు టీటీడీకి అందుతున్నవి ఆర్గానిక్ ముడిసరుకులేనా కాదా, వాటి నాణ్యత ఎలా ఉందని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. కుకింగ్‌లో మార్పులు తీసుకురావాలనే సూచనలు వచ్చాయి. పరిశీలిస్తున్నాం.

42మంది తహసీల్దార్లకు పోస్టింగ్

● పెండింగ్‌లో తిరుపతి రూరల్ మండలం ● కలెక్టరేట్ ఏవో జయరాములు బదిలీ ● నూతన ఏవోగా భారతి?

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 3: జిల్లాలో 42 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ శనివారం అర్ధరాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి రూరల్ మినహా మిగిలిన అన్ని మండలాలకు పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతి రూరల్ మండలంలో అత్యధికంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడంతో నిబద్ధత కలిగిన తహసీల్దారును నియమించేందుకు ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నారు. మండలాల వారీగా.. తిరుపతి అర్బన్‌కు కేపీ భాగ్యలక్ష్మి, చంద్రగిరికి ఎ.శివరామ్‌సుబ్బయ్య, పాకాలకు జె.నిత్యానందబాబు, ఆర్‌సీపురానికి కె.వెంకటరమణ, వడమాలపేటకు జరీనా, పుత్తూరుకు వి.సురేష్‌బాబు, ఎర్రావారిపాళెంకు పరమేశ్వరస్వామి, చిన్నిగొట్టిగల్లుకు జనార్దనరాజు, శ్రీకాళహస్తికి డి.లక్ష్మీనారాయణ, తొట్టంబేడుకు యు.మధుసూదనరావు, రేణిగుంటకు జీసీ వెంకటేశ్వర్లు, ఏర్పేడుకు ఎం.భార్గవి, కేవీబీపురానికి దస్తగిరయ్య, నాగలాపురానికి హనుమాన్ నాయక్, పిచ్చాటూరుకు రమేష్‌బాబు, నారాయణవనానికి ఎం.జయరాములు, బీఎన్‌కండ్రిగకు ఐ.సుబ్రహ్మణ్యం, వరదయ్యపాళెంకు పి.రాజశేఖర్, సత్యవేడుకు టీవీ సుబ్రహ్మణ్యం, ఓజిలికి ఎ.పద్మావతి, నాయుడుపేటకు పి.గీతావాణి, పెళ్లకూరుకు పి.అనురాధ, సూళ్లూరుపేటకు ఎస్.నరసింహారావు, తడకు బి.పద్మావతి, గూడూరుకు ఎస్.చంద్రశేఖర్, చిల్లకూరుకు కె.రవికుమార్, కోటకు కె.జయజయరావు, వాకాడుకు ఎస్.రామయ్య, చిట్టమూరుకు ఐఎస్ ప్రసాద్, బాలాయపల్లికి కేవీఆర్‌వీ ప్రసాద్, వెంకటగిరికి మునిలక్ష్మిని నియమించారు.

కలెక్టరేట్‌కు ఆరుగురి కేటాయింపు

కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లకు సూపరింటెండెంట్లుగా నియమించడానికి ఆరుగురు తహసీల్దార్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీరిలో.. పి.భారతి, పి.శిరీష, కె.కుప్పయ్య, ఎం.రోశయ్య, పి.లక్ష్మీనరసింహం, బీఆర్‌కే శివప్రసాద్ ఉన్నారు. కాగా, కలెక్టరేట్ ఏవో జయరాములు నారాయణవనం తహసీల్దారుగా బదిలీ కావడంతో ఈయన స్థానంలో భారతిని నియమించనున్నట్లు తెలిసింది.

నలుగురు డీటీలను ఇన్‌చార్జిలుగా..

నెల్లూరుజిల్లా నుంచి వచ్చిన నలుగురు డిప్యూటీ తహసీల్దార్(డీటీ)లను ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియమించారు. డీవీసత్రానికి పి.శైలకుమారి, దక్కిలికి ఎం.శ్రీనివాసులు నియమితులయ్యారు. హరికృష్ణను కలెక్టరేట్‌కు, గూడూరు ఆర్డీవో కార్యాలయానికి శిరీషను కేటాయించారు.

ఆర్డీవో కార్యాలయాల ఏవోలు వీరే..

ఆర్డీవో కార్యాలయాలకు ఏవోలుగా పి.ఝాన్సీలక్ష్మి (తిరుపతి) సి.శ్రీదేవి (శ్రీకాళహస్తి), ఎస్.ద్వారకనాథరెడ్డి (సూళ్లూరుపేట), శిరీష (గూడూరు)ను నియమించారు.

పులికాట్ పూడికతీతకు చర్యలు చేపట్టండి

● మత్స్యకారులకు ఉపాధి, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది: కలెక్టర్



పులికాట్ పూడికతీతపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి(విద్య), ఆగస్టు 3: పులికాట్ సరస్సు ముఖద్వారం వద్ద పూడిక తీసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో టూరిజం, మత్స్య, అటవీ శాఖాధికారులతో సమావేశమయ్యారు. పులికాట్ పూడికతీత, నేలపట్టు పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. పూడికతీతతో మత్స్యకార కుటుంబాలకు ఉపాధి, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. సముద్రపు నీరు సరస్సులోకి రావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. సరస్సులో ఎల్లపుడూ నీరు ఉంటే ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉన్న పులికాట్, నేలపట్టు పక్షుల అభయారణ్యం మెరుగవుతాయని వివరించారు. దీనివల్ల పలురకాల పక్షులు వస్తాయని, తద్వారా సందర్శకులు పెరిగి పర్యాటకం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే పులికాట్ పరిసర గ్రామాల ప్రజలకు రహదారి, మౌలిక సదుపాయాల కల్పనపైనా సమీక్షించారు. మత్స్య, అటవీశాఖ అధికారులు స్పందిస్తూ.. పులికాట్ ముఖద్వారం వద్ద పూడికతీతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా నిధులు సమకూర్చే విధంగా రూ.97.09కోట్లకు సాగరమాల పథకం కింద అనుమతులు వచ్చాయన్నారు. అయితే నిధులు ఇంకా విడుదల కాలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వో శామ్యూల్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా

వైసీపీ హయాంలో వేధింపులపై ఓ ప్రిన్సిపాల్ ఆవేదన



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

పిచ్చాటూరు, ఆగస్టు 3: రాష్ట్రంలో ఐదేళ్ళ వైసీపీ పాలన ఎంత వేధింపులమయంగా సాగిందో తెలిపే ఉదాహరణ ఇది.పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన 2020లో బదిలీపై ఇక్కడికి వచ్చారు.అప్పట్లో సత్యవేడు నియోజకవర్గ వైసీపీలో నెలకొన్న వర్గ విబేధాలు కళాశాలను కూడా చుట్టుముట్టాయి. ఈ క్రమంలో కళాశాలకు మంజూరైన అభివృద్ధి పనుల విషయంలో ఆధిపత్య పోరుతో వైసీపీ నాయకులు కళాశాల ప్రిన్సిపాల్‌ను వేధించారు.ఈ విషయాలను శనివారం కళాశాలలో జరిగిన పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం, విద్యార్థుల ఎదుట ప్రిన్సిపాల్ శ్రీధర్ వివరించారు. ఇక్కడ ఉద్యోగం చేయడం కన్నా అడుక్కుతిని బతకొచ్చనిపించిందంటూ ఆవేదన వెళ్ళగక్కారు. అప్పట్లో వైసీపీ నాయకుల వేధింపులను భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, కుటుంబ సభ్యులిచ్చిన ధైర్యంతో ఆ ఆలోచనను విరమించుకున్నానని బహిరంగంగా చెప్పడం చర్చనీయాంశమైంది.ఇంకా మూడేళ్ల సర్వీసున్నా 10 నెలల క్రితం వలంటరీ రిటైర్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు.ఈ నెలలోనే రిటైర్‌మెంట్ తీసుకోనున్నట్లు తెలిపారు.మంత్రి లోకేష్ విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దిరెడ్డికి ఊచలు లెక్కపెట్టే సమయం దగ్గరపడింది

● మంత్రి రాంప్రసాద్ రెడ్డి

చిత్తూరు రూరల్, ఆగస్టు 3 : 'పెద్ద రెడ్డో... చిన్న రెడ్డో ప్రజలకు అన్యాయం చేసిన ఎవరైనా ఊచలు లెక్క పెట్టాల్సిందే. పెద్దిరెడ్డి తాను చేసిన పాపాలకు ఊచలు లెక్కపెట్టే సమయం దగ్గర పడింది' అని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. ఈ నెల 5వ తేదీన పుంగనూరు పర్యటనలో ఆయన పాపాలను వెలికితీస్తానని చెప్పారు.శనివారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన 17 బస్సులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పుంగనూరు పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోనున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు.గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఒక్క బస్సు కూడా కొనలేకపోయిందని తెలిపారు.చంద్రబాబు సీఎం అయిన తర్వాత 1,400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, అందులో 400 రోడ్లపై తిరుగుతున్నాయని చెప్పారు. రానున్న ఐదేళ్లలో రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతాయన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 3: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోనిఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద విద్యార్థులకు యూనిఫాం, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను కూడా ఇదే కళాశాలలో చదువుకున్నానన్నారు. తాను విద్యావంతుడిని కాబట్టే 1994లో మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా టీడీపీ అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జిలానీబాషా, సీఐ రవికిరణ్, చెంచురామయ్య, శ్రీపతిబాబు, భుజగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ క్యాంపు కార్యాలయంలో తమ్మినపట్నానికి చెందిన ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సర విద్యార్థి క్రాంతికిరణ్ ఫీజును చెల్లించేందుకు జిందాల్ కంపెనీ ముందుకు వచ్చి రూ.1.20 లక్షలను అందించిందన్నారు. ఆ చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లలో ప్రభుత్వ స్థలాలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వీటిపై విచారణ జరిపి స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

పేద విద్యార్థుల చదువుకు నగదు అందజేత



చిట్టమూరు, ఆగస్టు 3: మండలంలోని కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో టెన్త్ చదువుతున్న ఇద్దరు విద్యార్థుల చదువుల కోసం నగదు అందజేశారు. బయ్యవారికండ్రిగకు చెందిన ఓ.శ్రీనివాసులు కుమార్తె మోనిష పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్ కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చిల్లకూరు, ఆగస్టు 3: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం రొటేరియన్ చల్లా రాంకుమార్ దాతృత్వంతో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, రవీంద్రరెడ్డి, బలరామిరెడ్డి, హెచ్‌ఎం సుధాకర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



వెంకటగిరిటౌన్, ఆగస్టు 3: పట్టణంలోని 21 వార్డులో ఆర్డీఓ కిరణ్ కుమార్ శనివారం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోనికా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మౌనికా రెడ్డి మాట్లాడుతూ... పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొవిడ్‌లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందించామన్నారు. విద్యార్థులకు కంప్యూటర్లు, వృద్ధులకు పెన్షన్, గర్భిణులకు పౌష్టికాహారం అందించామన్నారు. మున్సిపల్ కమిషనర్ రషీద్, ఎంపీడీవో నీల కంఠేశ్వరరెడ్డి, సీఐ సంగమేశ్వరావు, డీటీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ అన్నదానం ట్రస్టు ఏర్పాటు చేయండి



వెంకటగిరి టౌన్, ఆగస్టు 3: ప్రసిద్ధి గాంచిన వెంకటగిరి పోలేరమ్మ జాతర పేరుతో నిత్య అన్నదానం ట్రస్ట్ ఏర్పాటుకు కృషి చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని వెంటకగిరి పట్టణానికి చెందిన ప్రకృతి కుమార్ కోరారు. శనివారం మంత్రిని నెల్లూరు నగరంలోని ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు వెంకటగిరిలో పోలేరమ్మ ఆస్తులను పరిశీలించి ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపీనాథ్, శ్యామ్, తోట పవన్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అదనపు ఈవోతో కురుగొండ్ల భేటీ



డక్కిలి, ఆగస్టు 3: తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో వెంకయ్య చౌదిరిని శనివారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమలకు వెళ్లిన కురుగొండ్ల అదనపు ఈవో కార్యాలయానికి వెళ్లి వెంకయ్య చౌదరికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.

చికిత్సలకు ఆర్థిక సాయం

గూడూరు అర్బన్, ఆగస్టు 3: అగ్నిప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న విద్యార్థిని కుటుంబ సభ్యులకు ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ... సైదాపురం మండలం మర్లపూడి గ్రామంలో ఓ ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని నవ్యశ్రీ గాయపడడంతో తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుందన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం తమ సంస్థ ఆధ్వర్యంలో రూ.15వేలను బాలిక కుటుంబ సభ్యులకు అందించామన్నారు. కార్యక్రమంలో రమేష్, జీ చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, ఆగస్టు 3: రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుక ధరలు తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తీసుకురావాలంటే అధికభారం పడుతోందని దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో రీచ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకరయ్య, శేఖరాచారి, మధు, శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు, ఆగస్టు 3: మండలంలోని మోమిడి గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శనివారం మోమిడి - బల్లవోలు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మోమిడి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బల్లవోలు జట్టు 11.3 ఓవర్లలో 62 పరుగులకే ఆలౌట్ కావడంతో ఓటమిపాలైంది.

తీరం చేరని ప్రయాణం?

అధ్వానంగా తీర ప్రాంత గ్రామాల రహదారులు

గత ఐదేళ్లూ పట్టించుకోని పాలకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 3: సూళ్లూరుపేట సింహభాగం తీరప్రాంతాలదే. సూళ్లూరుపేటలో కొరిడి - పేర్నాడు, కారికాడు, మీజూరు, వేనాడు దీవి పులికాట్ తీరంలో విస్తరించి ఉన్నాయి. ఈ గ్రామాలను ఆనుకొని దేశానికే తలమానికం అయినా శ్రీహరికోట రాకెట్ కేంద్రం ఉంది. ఆ పక్కనే అధ్వాన రోడ్లు ఉండడం గమనార్హం. చిన్నపాటి పని నిమిత్తం పట్టణాలకు రావాల్సి ఉండడం, ఏళ్లు గడిచినా తీర ప్రాంతాలకు రహదారులు కొత్త రూపు సంతరించుకోవడం లేదు. ఎందుకో పాలకులు సైతం దీనిపై దృష్టి సారించడం లేదు. దీంతో ఈ రహదారుల్లో ప్రయాణమంటేనే గ్రామీణులు హడలి పోతున్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకుని ఉంటే ...

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పులికాట్ తీర ప్రాంత రహదారులను పట్టించుకున్న దాఖలాలు లేవు. గడ ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పులికాట్ తీర ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. పలుచోట్ల రోడ్లు కోతకు గురై బస్సులు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. అప్పటి వైసీపీ ప్రభుత్వం కనీసం గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోలేదు. గడిచిన ఐదేళ్లలో రోడ్లకు తట్టెడు మట్టి కూడా వెయ్యకపోవడంతో రాకపోకల సమయంలో తీర ప్రాంతవాసులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

ప్రమాదాలు జరిగినా..

తీర ప్రాంత గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు నడపాలన్నా గగనంగా మారింది. బస్సు బయలుదేరిన అనంతరం గమ్యం చేరేదాకా అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం సాగించాల్సి వస్తుంది. కొరిడి-పేర్నాడు మార్గంలో ఆర్టీసీ బస్సు పులికాట్‌లో బోల్తాపడిన సందర్భాలున్నాయి. విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు కూడా మరమ్మతులకు గురై మధ్యలో ఆగిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆర్టీసీ యాజమాన్యం ఈ అధ్వాన రోడ్డులో బస్సులు నడపలేమంటోంది. వర్షాకాలమైతే రోడ్డు బురదమయంగా మారి బస్సు పులికాట్‌లోకి దూసుకెళ్లిన సంఘటనలున్నాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడం లేదు.

మంజూరైన నిధులు వెనక్కి..

సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో పలు గ్రామాలకు ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. వీటిలో పలు గ్రామాలకు ఇంకా మట్టి రోడ్లే దిక్కు. వీటిని తారు రోడ్లుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ వివిధ పద్దుల కింద నిధులు మంజూరు చేస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వెనక్కి వెళ్తున్నాయి. క్షేత్రస్థాయిలో జరిగే లోటుపాట్లను గుర్తించి, వాటి పై సమీక్షలు జరిపి ప్రభుత్వంలో ఉన్నతస్థాయికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతి నిధులు సైతం ఈ విషయంలో చొరవ చూపకపోవడం గమనార్హం.

అటవీశాఖ అడ్డంకులతో...

పులికాట్ తీరంలో రోడ్డు నిర్మాణానికి జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డు అనుమతులు ఇవ్వాలి. పలుచోట్ల అనుమతుల్లేక పనులు జరగలేదు. దీనిపై వివిధ రాష్ట్రాల నుంచి వినతులు వెళ్లడంతో స్పందించిన కేంద్రప్రభుత్వం 2016లో కొంత వెసులుబాటు కల్పించింది. గ్రామాలకు ప్రజా రవాణాసౌకర్యం వసతులు కల్పించేటప్పుడు రహదారుల నిర్మాణానికి డిజిటల్ సర్వే చేశాక పర్యావరణానికి భంగం కలగకుండా పనులు చేసుకోవచ్చునని ఉత్తర్వులిచ్చింది. దీంతో పులికాట్ తీరంలో రోడ్ల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు డిజిటల్ సర్వే చేపట్టినా పనుల్లో కదలిక లేదు. వన్యప్రాణి విభాగం అడ్డంకులతో రెండు నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణ పనులు జరగకుండా ఆగిపోయాయి.

ప్రత్యామ్నాయం తప్పని సరి..

అటవీశాఖ భూముల్లో రోడ్డు వేయాలంటే ప్రత్యామ్నాయంగా స్థలాలను చూపి, సంబంధిత శాఖకు అప్పగించాలి. కిలోమీటరు రహదారిని 20 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తే రెండు హెక్టార్ల ప్రత్యామ్నాయ భూమి చూపాలి. కిలోమీటరు రోడ్డును 15 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తే 1.5 హెక్టార్ల భూమి అప్పగించాలి. ఈ లెక్కన సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో 90 కిలో మీటర్ల మేర రహదారుల నిర్మాణానికి 180 హెక్టార్ల భూములు అటవీశాఖకు కేటాయించాల్సి ఉంది. ఇప్పటికీ పలుచోట్ల రెవెన్యూ అధికారులు అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా భూములు చూపలేదు.





అధ్వానంగా ఉన్న కొరిడి-పేర్నాడు రోడ్డు - దుస్థితికి చేరుకున్న వేనాడు రోడ్డు

కొరిడి-పేర్నాడు రోడ్డుకు పంపినా..

సూళ్లూరుపేట మండలంలోని కొరిడి-పేర్నాడు రోడ్డు నిర్మాణానికి 1.87 హెక్టార్లకుగాను రెవెన్యూ అధికారులు 30 ఎకరాలు ఎంపిక చేసి కలెక్టరేట్‌కు ప్రతిపాదనలు పంపారు. అయినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

సాగు భూములకు పట్టాలివ్వండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో వజ్జావారిపాళెంవాసులు

కోట, ఆగస్టు 3: రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న అటవీ పోరంబోకు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ మండలంలోని చిట్టేడు పంచాయతీ వజ్జావారిపాళెంవాసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కొంతమంది నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి తమ అధీనంలో ఉన్న భూములను కాజేయాలని చూస్తున్నారని, తక్షణం స్పందించి పట్టాలివ్వాలని డిమాండు చేశారు. వజ్జావారిపాళెం రెవెన్యూ సర్వే నెం.18/2లో 97.38 ఎకరాల అటవీ పోరంబోకు భూముల్లో 20 యేళ్ల క్రితం చెట్టుపుట్టా తొలగించి చదును చేసుకుని పంటలు పండిస్తున్నామన్నారు. అయితే ఆయా భూములకు పట్టాలు ఇవ్వలేదన్నారు. బయట గ్రామాలకు చెందిన కొంతమంది తమ ఆధీనంలో ఉన్న అటవీ పోరంబోకు భూములకు నకిలీ పట్టాలు సృష్టించి విక్రయిస్తున్నారన్నారు. అదేమని అడిగితే తమను బెదిరిస్తున్నారన్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దారు అల్లం మల్లికార్జున రావుకు వినతిపత్రం అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



భక్తులకు అన్నదానం

చిల్లకూరు, ఆగస్టు 3: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివార్లకు శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



కోటపోలూరులో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 3: సాగు చేసే భూములకు మూడేళ్లకు ఒక్కసారి భూసార పరీక్షలు తప్పని సరిగా చేసుకోవాలని ఆత్మ జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కోటపోలూరులో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... అధికారుల సలహా మేరకే ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జి.అనిత మాట్లాడుతూ... కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకుంటే ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తిస్తాయన్నారు. అదే విధంగా ఈ-క్రాప్ కూడా నమోదు చేసుకోవాలన్నారు. ఏవో కవిత, ఈఏఏలు హిమబిందు, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

చిల్లకూరు, ఆగస్టు 3: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని సీడీపీవో జ్యోతికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని బూదనంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించి తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించారు. నాయుడుపేట పట్టణంలోని ఎల్‌ఎసాగరంలోని లోతువానిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వాకాడు మండలంలోని సిద్ధిగుంటపాళెం, వాకాడు, వెంకటరెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల ఆవశ్యకతపై ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వెంకటగిరి అంగన్‌వాడీ అధికారిణి షంషాద్‌బేగం అన్నారు. శనివారం మండలంలోని దగ్గవోలు, ఆల్తూరుపాడుల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీలో గల వావిళ్లదొరువులో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు, వడ్డిపాలెంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో ప్రజాదర్బార్



బాధితుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని అధ్యక్షుడు నరసింహ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వారి సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రజాదర్బార్‌లో చెప్పుకోవచ్చన్నారు. సమస్యలను పరిష్కరిం చేలా పార్టీకి, ప్రభుత్వానికి వారధిగా ప్రజా దర్బార్ ఉంటుందన్నారు. ప్రతి శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు చేజెర్ల మనోహరాచారి, యశ్వంత్ రెడ్డి, రవిశంకర్ యాదవ్, మురళి, సురేష్, పెంచలయ్య, చెంగయ్య, ఆవుల శ్రీనివాసుల యాదవ్ పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌కు ఘన నివాళి



కోట, ఆగస్టు 3: మండలంలోని విద్యానగర్ ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో శనివారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 46వ వర్ధంతి శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి విగ్రహానికి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు, బోధన, బోదనేతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... బాలకృష్ణారెడ్డి నేటి తరాలకు ఆదర్శమన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

తడ, ఆగస్టు 3: భర్త అనుమానించాడన్న మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మండల పరిధిలోని చేనిగుంట దళితవాడలో నివాసం ఉంటున్న ఎన్.మేరి (27)కి తొమ్మిదేళ్ల క్రితం విజయ్‌తో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. వీరి స్వస్థలం తమిళనాడు పలవర్‌కాడు. ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం చేనిగుంటకు చేరుకున్నారు. అయితే భర్త పనికి సరిగా వెళ్లకపోవడంతో మేరీ వెళ్లేది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా భార్యపై అనుమానంతో గొడవపడేవాడు. శుక్రవారం గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె పురుగులమందుతాగింది. కుటుంబసభ్యులు ఆమెను నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3: మండలంలోని పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో ఓ దాబా వద్ద అనుమానస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రాజస్థాన్‌కు చెందిన పవన్‌కుమార్(45) కర్ణాటక రాష్ట్రం కోలార్ నుంచి కోల్‌కాతాకు లారీని తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పండ్లూరు వద్ద ఉన్న దాబా వద్ద లారీ ఆపి వాహనంలోనే పడుకున్నాడు. రాత్రి వరకు లేవకపోవడంతో అదే కంపెనీకి చెందిన మరో లారీ డ్రైవర్ అక్కడికి చేరుకుని పవన్‌కుమార్‌ను నిద్రలేపాడు. ఎంతసేపటికీ లేవకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పవన్‌కుమార్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.92 కోట్లు

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.92 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 62,540 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,241 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో కేంద్రమంత్రి



భూపతిరాజుతో పార్థసారథి

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని లైలావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ స్వాగతం పలికారు. అలాగే రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కూడా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. ఈక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఛైర్‌పర్సన్ విజయభారతి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సింధూరి రెడ్డి, బండారు శ్రావణి, గాయకుడు గజల్ శ్రీనివాస్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

భక్తులను హడలెత్తించిన నాగుపాము



అలిపిరి నడక మార్గంలో శనివారం ఓ నాగుపాము భక్తులను హడలెత్తించింది. నడక మార్గంలోని 2,700వ మెట్టు వద్దకు వచ్చిన సుమారు అరడుగుల పొడవు కలిగిన పామును గుర్తించిన భక్తులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. వెంటనే దగ్గర్లోనే భద్రతా సిబ్బంది పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం ఆ పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

30 ఏళ్ల పోరాట ఫలితమే వర్గీకరణ



సూళ్లూరుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ సంబరాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంతో శనివారం సూళ్లూరుపేట పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్దనున్న అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వర్గీకరణకు బీజం వేసిన ఎన్డీఏ కూటమిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుక్కమల్లి రవి, మాసారం చెంగమ్మ, బుజ్జమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితమే ఎస్సీ వర్గీకరణకు సానుకూల స్పందన అని సమితి నాయకులు పెంచలయ్య, సిసింద్రి అన్నారు. శనివారం మండలంలోని సంతదాసుపల్లిలో ఎస్సీ వర్గీకరణపై ధర్మాసనం సానుకూలంగా స్పందించడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, మస్తానయ్య, మల్లికార్జున, శ్రీనివాసులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు అధికారాలు కల్పించండి

● సీఎం చంద్రబాబుకు విన్నపం



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాగేంద్రప్రసాద రెడ్డి

పెళ్లకూరు, ఆగస్టు 3: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సర్పంచులకు నిధులు, విధులు, అధికారాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి డి.నాగేంద్రప్రసాద రెడ్డి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వం సర్పంచుల అధికారాలను తగ్గించి పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన విషయం విదితమే. ఈక్రమంలో ఎన్నికల సందర్భంగా సర్పంచులకు అధికారాలు కల్పిస్తామన్న హామీని నెరవేరాల్సని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు నాగేంద్రప్రసాద్ చెప్పారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



విద్యార్థులకు సూచనలిస్తున్న జడ్జి అనూష

డక్కిలి, ఆగస్టు 3: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వెంకటగిరి కోర్టు జడ్జి అనూష పిలుపు నిచ్చారు. శనివారం డక్కిలిలోని ఎస్‌కేఎం డిగ్రీకళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మట్లాడుతూ... మత్తు పదార్థాలు, పానీయాల సేవనంతో బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. విద్యార్థులకు ఎరవేసి వారి ద్వారా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నారని చెప్పారు. ఇంజనీరింగ్, వైద్య విద్యార్థులు సైతం వీటికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా వుండి చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, న్యాయవాది అద్దంకి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



కోట, ఆగస్టు 3: మండల పరిధిలోని గూడలి, ఊనుగుంట పాళెం స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తెల్లవారు జామున గ్రామస్తుల సహకారంతో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక నింపుకుంటున్న రెండు ట్రాక్టర్లను నది లోపలే గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.